ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

కాకినాడ

జిల్లా వార్తలు

ఆదివారం 25 మే 2025 | 5





సత్యవాడ గ్రామంలో శానిటేషన్ చేస్తున్న పంచాయతీ కార్మికుడు



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ షాన్‌మోహన్

ఆయిల్‌పామ్ సాగును ప్రోత్సహించాలి : కలెక్టర్

కలెక్టరేట్ (కాకినాడ), మే24 (ఆంధ్రజ్యోతి): ఉద్యాన రైతులకు అన్ని విధాల మేలుచేసే ఆయిల్‌పామ్ సాగును ప్రోత్సహిస్తూ జిల్లాలో ఆరు వేల హెక్టార్లలో ఆయిల్‌పామ్ సాగు చేసేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని కలెక్టర్ షాన్ మోహన్ అధికారులను ఆదేశించారు. శనివారం ఆయన కలెక్టరేట్ నుంచి తహశీల్దార్లు, ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు, ఇతర శాఖల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టరేట్ నుంచి జాయింట్ కలెక్టర్ రాహుల్‌మీనా, వివిధ శాఖల అధికారులు హాజరయ్యారు. కలెక్టర్ షాన్‌మోహన్ మాట్లాడుతూ తక్కువ పెట్టుబడితో ఎక్కువ రోజులు దిగుబడినిచ్చే ఆయిల్‌పామ్ సాగువైపు జిల్లాలోని ఉద్యాన రైతులను ప్రోత్సహించాలన్నారు. ఎలాంటి వాతావరణ పరిస్థితులనైనా తట్టుకోగల ఆయిల్‌పామ్ సాగు చేయడం ద్వారా ఉద్యాన రైతులు అధిక లాభాలు పొందవచ్చన్నారు. గృహ నిర్మాణాలపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టి నిర్మాణ పనులు వేగంగా జరిగేలా చూడాలన్నారు. లబ్ధిదారులకు అవసరమైన ఇసుక, సిమెంట్ ఇతర మెటీరియల్ అందుబాటులో ఉందన్నారు. చివరి దశకు చేరుకున్న గృహాలను వెంటనే పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావాలన్నారు. వచ్చే నెల నుంచి తొలకరి పనులు ప్రారంభం కానున్న నేపథ్యంలో జిల్లాలో అర్హులైన కౌలుదారులందరకు సీసీఆర్సీ కార్డులు మంజూరు చేయాలన్నారు. పీఎం సూర్యఘర్ పథకం కింద జిల్లాలో ఎస్సీ వర్గాల ప్రజలకు ఉచితంగా సోలార్ రూఫ్‌టాప్ ప్యానల్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. 0-6 సంవత్సరాల మధ్య వయసు ఉన్న చిన్నారులందరికీ వెంటనే ఆధార్ రిజిస్ట్రేషన్ చేయించాలన్నారు. యోగాంధ్ర -2025ను రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోందన్నారు. ఈ కార్యక్రమాల్లో జిల్లావాసులు భాగస్వాములు అయ్యేలా ప్రతి ఒక్కరితో రిజిస్ట్రేషన్ చేయించాలని అధికారులకు స్పష్టంచేశారు. జిల్లా రెవెన్యూ అధికారి వెంకట్రావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



కరోనా.. హైరానా!

తొలి కేసు నమోదుతో అంతటా ఆందోళన

(అమలాపురం-ఆంధ్రజ్యోతి)

మళ్లీ కొవిడ్ వైరస్ జాడలు వెలుగు చూస్తున్నాయి. దేశ రాజధానితోపాటు ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లోని వివిధ ప్రాంతాల్లో కొవిడ్ వైరస్ కేసులు నమోదవుతున్నాయి. ఏపీ ప్రజారోగ్య కుటుంబ సంక్షేమ శాఖ డైరెక్టరేట్ ఇటీవల కొవిడ్ అప్రమత్తతపై ప్రజలు తీసుకోవాల్సిన చర్యలను వివరిస్తూ ఉత్తర్వులిచ్చింది. ప్రస్తుతం ఉమ్మడి జిల్లావ్యాప్తంగా వాతావరణంలో వస్తున్న మార్పులతో కొందరు జ్వరం, జలుబు, దగ్గు వంటి లక్షణాలతో బాధపడుతున్నారు. మళ్లీ కొవిడ్ వ్యాప్తి చెందుతోందన్న వార్తలతో ఏవైనా లక్షణాలు కనిపిస్తే ప్రజలు వెంటనే అప్రమత్తం అవుతున్నారు. ఇప్పటికే కొందరు మాస్కులు పెట్టుకుని తిరుగుతున్నారు. కాగా ప్రార్థనా సమావేశాలు, సామాజిక సమావేశాలు, పార్టీల కార్యక్రమాలు వంటి సామూహిక సమావేశాలను నిలిపివేయాలని హెల్త్ డిపార్టుమెంట్ సైతం ఆదేశించింది. రద్దీగా ఉండే ప్రాంతాల్లో కొవిడ్ 19 జాగ్రత్తలు పాటించాలని వృద్ధులు, గర్భిణులు ఖచ్చితంగా కొవిడ్ జాగ్రత్తలు తీసుకుంటూ ఇళ్లకే పరిమితం కావాల్సిందిగా సూచించారు. మాస్కులు ధరించాలని సూచించారు. కొవిడ్ 19 లక్షణాలు ఉంటే ముందుగా పరీక్ష చేయించుకుని ప్రభుత్వం ఇచ్చే ఆదేశాలు పాటించాలని సూచించారు. ఆరోగ్యశాఖ అన్ని పరీక్షా సౌకర్యాలతో కూడిన ల్యాబ్‌లు, మాస్కులు, పీపీఈ కిట్లు, ట్రిపుల్ లేయర్ మాస్కులు తగినంత పరిణామంలో ఆసుపత్రిలో సిద్ధం చేసుకోవాల్సిందిగా సూచనలు చేశారు. కాకినాడ, రాజమహేంద్రవరంలలోని జీజీహెచ్‌లలో ప్రత్యేక వార్డులను ఏర్పాటుచేశారు. కోనసీమ జిల్లా సత్యవాడలో కొవిడ్ కేసు నేపథ్యంలో ప్రజలు అప్రమత్తం అయ్యారు. జలుబు, జ్వరం ఉన్నవారంతా ఆందోళన చెందుతున్నారు.

- అప్రమత్తమైన అధికారులు
- జిల్లా ఆసుపత్రుల్లో ఐసోలేషన్ వార్డులు

రాజమహేంద్రవరం జీజీహెచ్‌లో కొవిడ్ ఐసోలేషన్ వార్డు

రాజమహేంద్రవరం అర్బన్, మే 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా కొవిడ్ కేసులు క్రమంగా పెరుగుతున్న నేపథ్యంలో రాజమహేంద్రవరం ప్రభుత్వ బోధనాసుపత్రిలో కొవిడ్ ఐసోలేషన్ వార్డు ఏర్పాటు చేసేందుకు అధికారులు చర్యలు ప్రారంభించారు. సోమవారం నాటికి వార్డు సిద్ధం కావొచ్చని చెబుతున్నారు. ముందుగా 15 బెడ్స్‌తో ఐసోలేషన్ వార్డును సిద్ధం చేసి, అవసరమైతే మరో 15 బెడ్స్‌ను అందుబాటులోకి తీసుకురావాలని భావిస్తున్నారు. పాత మలేరియా అధికారి కార్యాలయం నిర్వహించిన రేకులషెడ్డును కొవిడ్ ఐసోలేషన్ వార్డుగా మార్చాలని అధికారులు నిర్ణయించారు. ఈ మేరకు శనివారం షెడ్డులో ఉన్న సామగ్రిని తరలించే కార్యక్రమం చేపట్టారు. బెడ్స్ ఆక్సిజన్, ఇతర వైద్య సౌకర్యాలు ఏర్పాటు చేసి అందుబాటులోకి తెస్తారు.



సత్యవాడలో వివరాలు సేకరిస్తున్న వైద్య సిబ్బంది

కోనసీమలో తొలి కేసు..

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కె.గంగవరం మండలం సత్యవాడకు చెందిన వృద్ధుడికి గత మూడు రోజులుగా లోఫీవర్, నిరంతరంగా ముక్కు కారడం వంటి సమస్యలతో బాధపడుతుండడంతో కుటుంబీకులు శుక్రవారం రాత్రి ద్రాక్షారామలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లారు. వైద్యులు కొవిడ్ ర్యాపిడ్ కిట్ పరీక్ష నిర్వహించి పాజిటివ్‌గా గుర్తించారు. అనంతరం అతడిని కాకినాడ జీజీహెచ్‌కు తరలించాల్సిందిగా సూచించారు. కుటుంబీకులు శనివారం జీజీహెచ్‌కు తరలించగా స్వాబ్ శాంపిల్‌తో ఆర్‌టీపీసీఆర్ పరీక్ష చేసి కొవిడ్ పాజిటివ్‌గా నిర్ధారించారు. అనంతరం అతన్ని ఈఎన్‌టీ విభాగంలో ఏర్పాటుచేసిన కొవిడ్ వార్డుకు తరలించి చికిత్సను అందజేస్తున్నారు. ప్రస్తుతం అతని ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నట్టు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎంపీఆర్ విఠల్ వెల్లడించారు. ఉమ్మడి తూర్పుగోదావరి పరిధిలోనే ఈ ఏడాది ఇదే తొలి కేసు కావడంతో వైద్య వర్గాలన్నీ అప్రమత్తం అయ్యాయి.

ఆందోళన వద్దు.. అప్రమత్తత అవసరం



కొవిడ్‌తో ఆందోళన వద్దు.. ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. సత్యవాడకు చెందిన వృద్ధుడికి కొవిడ్ పాజిటివ్ రావడంపై మంత్రి స్పందించారు. పాజిటివ్ వచ్చిన వ్యక్తికి తేలికపాటి లక్షణాలు మాత్రమే ఉన్నాయి. జిల్లా వైద్యశాఖ అధికారులు, కాకినాడ ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్‌తో మాట్లాడి వైద్య సిబ్బందిని అప్రమత్తం చేశాం. ప్రజలు భయాందోళనకు గురికావాల్సిన అవసరం లేదు.. ధైర్యంగా ఉండాలి. కరోనా లక్షణాలు కనిపిస్తే పరీక్షలు చేయించుకుని తగిన వైద్యసేవలు పొందాలి. - **వాసంశెట్టి సుభాష్, మంత్రి**



నాడు సెల్ఫీ తీసుకున్నారు... నేడు లెక్క తీస్తారు : ఆగస్టు 17 2023న జొన్నాడలో ఇసుక గుట్టల వద్ద సెల్ఫీ తీసుకుంటున్న చంద్రబాబు (ఫైల్‌ఫోటో)

అక్రమాలు.. తవ్వేస్తారు!

ఇక ఇసుక అక్రమాల వంతు వచ్చింది.. గత వైసీపీ హయాంలో లెక్కలను తవ్వనున్నారు.. నాడు వంద కోట్ల రూపాయల విలువైన ఇసుకను దోపిడీ చేసిన కీలక నేతల గుండెల్లో గుబులు రేగుతోంది.రాష్ట్ర ప్రభుత్వం ఇసుక అక్రమాలపై సిట్‌ను ఏర్పాటు చేస్తూ తీసుకున్న నిర్ణయం గత ఐదేళ్ల వైసీపీ పాలనలో అడ్డగోలుగా దోపిడీకి పాల్పడ్డ ఇసుక మాఫియా అక్రమాలు వెలుగు చూస్తాయనే ఆందోళన అప్పుడే ప్రారంభమైంది.. నాడు ప్రతిపక్ష నాయకుడి హోదాలో జిల్లా పర్యటనకు హాజరైన చంద్రబాబు ఆలమూరు మండలం జొన్నాడ వద్ద సెల్ఫీ చాలెంజ్ విసిరారు. ఇప్పుడు సీఎం హోదాలో ఆ అక్రమాలను వెలికితీసే పనిలోపడ్డారు..

(రాజమహేంద్రవరం/అమలాపురం-ఆంధ్రజ్యోతి)

వైసీపీ హయాంలో గోదావరిలో జరిగిన ఇసుక దోపిడీపై సిట్ దర్యాప్తునకు ప్రభుత్వం ఆమోదం తెలపడంతో అప్పటి సర్కారీ పెద్దలతోపాటు ఇసుక దోపిడీలో భాగమైన అధికార, అనధికారుల వెన్నులో వణుకు మొదలైంది. కొవ్వూరు, నిడదవోలు, రాజ మహేంద్రవరం, రూరల్, రాజానగరం, రామచంద్రపురం, మండపేట, కొత్తపేట, పి.గన్నవరం, రాజోలు, ముమ్మిడివరం నియోజకవర్గాల పరిధిలోని ర్యాంపుల నుంచి ఐదేళ్ల కాలంలో వందల కోట్లు విలువైన ఖనిజ సంపద దోచుకుపోయారు. నాడు ఏపీఎండీసీకి అప్పగించినట్టే అప్పగించి వేల కోట్లు దోచుకు న్నారు. తూర్పుగోదావరి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వ్యాప్తంగా వందల కోట్ల రూపాయల ఇసుక అక్రమార్కులకు ఆదాయ వనరుగా మారింది.నాడు జగన్మోహన్‌రెడ్డి నాయకత్వంలో గౌతమి, వశిష్ఠ, వైనతేయ, వృద్ధ గౌతమీ నదీపాయల్లో లభ్యమయ్యే వందల కోట్ల విలువైన ఇసుకను అక్రమంగా దోచేశారు.

దోపిడీ సాగిందిలా..

ఇసుకలో వైసీపీ దోపిడీ అంతా ఇంతా కాదు.. గోదావరిని జోన్-2, జోన్-3 కింద విభజించి మొదట జేపీ వెంచర్స్‌కు రెండేళ్లకు కాంట్రాక్టు ఇచ్చారు. ఈ సంస్థ ఆన్‌లైన్ లావాదేవీలు చేయకుండా ఒకే ఒక్క బిల్లు బుక్ పట్టుకుని అక్రమంగా లక్షలాది టన్నుల ఇసుకను తరలించేసింది. 2023 మే నెలలో ఈ సంస్థ కాంట్రాక్టు ముగియడంతో వారిని పక్కన పెట్టి అప్పటి వైసీపీ సర్కారీ పెద్దలు తెరమీదకు వచ్చారు. జేపీ సంస్థ వాడిన బిల్లులనే చూపిస్తూ అనధికారికంగా మరింత బరితెగించిన సంగతి తెలిసిందే. వీరు ఏకంగా ర్యాంపులన్నింటికీ ఒకే వ్యక్తికి అప్పగించి నెలకు సుమారు రూ.30 కోట్ల వరకూ చెల్లించేలా ఒప్పందం పెట్టుకున్నారు. ఇసుక తవ్వకముందే వారికి డబ్బు ఇచ్చేటట్టు లోపాయికారి ఒప్పందం జరిగింది. కొవ్వూరు డివిజన్‌లోని ర్యాంపులను కొవ్వూరుకు చెందిన వైసీపీ నేత ప్రేమ్‌రాజ్ దక్కించుకుని అప్పుల పాలయ్యాడు. అనంతరం ప్రేమ్‌రాజ్ కొవ్వూరులో రైల్వే పట్టాలపై ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ కేసు దర్యాప్తు పూర్తి చేయనీయలేదు. తాడేపల్లి నుంచి కొందరు పెద్దలు పంపిన వ్యక్తులు వచ్చి ప్రేమ్‌రాజ్ కేసును మూయించేసినట్టు అప్పట్లో ప్రచారం జరిగింది. ఇవాళ సిట్‌ని నియమించడంతో ఈ కేసును పూర్తిగా దర్యాప్తు చేస్తే ఇసుక కుంభకోణాల డొంక కదలక తప్పదు. రాజమహేంద్రవరం వైపు ఆర్కే అనే వ్యక్తి మొత్తం ర్యాంపులను తీసుకుని సర్కారుకు కప్పం చెల్లించిన సంగతి తెలిసిందే. ఇందులో కొన్ని కుంభకోణాలు కోర్టు వరకూ వెళ్లడంతో సుప్రీంకోర్టు విచారణకు ఆదేశించింది. దీనిపై అప్పటి జిల్లా కలెక్టర్ మాధవీలత, ఎస్పీ జగదీష్‌తో కూడా తప్పుడు రిపోర్టు ఇప్పించినట్టు ప్రచారం జరిగింది. గోదావరిలో అక్రమాలపై ధవళేశ్వరం గ్రామానికి చెందిన వంశీ అనే ఇసుక వ్యాపారి కోర్టును ఆశ్రయించడంతో ఎస్పీ ఆఫీసుకు అతన్ని పిలిపించి అడిషనల్ ఎస్పీలు, డీఎస్పీలు, సీఐలు చుట్టుముట్టి అతని చేత బలవంతంగా ఫిర్యాదు వెనక్కి తీయించడం అప్పట్లో సంచలనమైంది. ఇదంతా తాడేపల్లి పెద్దల ఒత్తిడితోనే జరిగినట్టు ప్రచారం జరిగింది.

నాడు చంద్రబాబు సెల్ఫీ చాలెంజ్

2023ఆగస్టు 17న జొన్నాడలో ఉన్న ఇసుక గుట్టలను చంద్రబాబునాయుడు సందర్శించారు. కోనసీమ పర్యటనలో భాగంగా అప్పటి వైసీపీ ఎమ్మెల్యేల పేర్లను ప్రస్తావిస్తూ ఇసుక దోపిడీలో ఎన్ని వందల కోట్లు దోచుకున్నారో లెక్కలతో సహా ఆరోపణాస్త్రాలు సంధించారు. అప్పటి వైసీపీ ప్రభుత్వానికి సెల్ఫీ చాలెంజ్ చేశారు. ఇసుక దోపిడీలో నాటి ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు కీలక పాత్ర వహించినట్టు తేల్చారు. ఇప్పుడు సీఎం హోదాలో లెక్క తేల్చనున్నారు.

కోర్టును తప్పుదారి పట్టించి..

ఇసుక కుంభకోణాలు, అక్రమాలపై సుప్రీం కోర్టు ఆగ్రహం వ్యక్తంచేయడంతో ఇక్కడ అసలు డ్రెడ్జింగ్ అక్రమాలు జరగలేదని, నిబంధనలు ఎవరూ ధిక్కరించలేదని ప్రభుత్వం అనుమతి ఇచ్చిన సంస్థ పేరునే డ్రెడ్జింగ్ జరిగినట్టు ఓ బూటకపు నాటకాన్ని తెరమీదకు తేవడం కూడా చాలామందికి తెలిసే ఉంటుంది. అప్పట్లో ధవళేశ్వరం బ్యారేజీ నుంచి కాతేరు శివారు వెంకటనగర్ వరకూ, కొవ్వూరు డివిజన్‌లోనూ రాత్రీ పగలూ అనధికారికంగా డ్రెడ్జింగ్ జరిగిన సంగతి తెలిసిందే. 2023 మే నెల నుంచి వందలాది డ్రెడ్జింగ్ పడవలతో ఇసుక దోపిడీ జరిగింది. 2023 డిసెంబర్‌లో ప్రతిమ సంస్థ పేరుతో రంగంలోకి దిగి డ్రెడ్జింగ్ చేశారు. దీనిని పక్కదారి పట్టించడానికి గతంలో డ్రెడ్జింగ్‌కు అనుమతి పొందినా ఇసుక తీయని సంస్థను తెరమీదకు తెచ్చి నాటకాలాడారు. ఇందులో బోట్స్‌మన్ సొసైటీలను భాగస్వామ్యం చేశారు. ఇలా కోర్టును తప్పుదారి పట్టించడమే కాకుండా రూ.వందల కోట్లు బిల్లులు ఇవ్వాలని తర్వాత ప్రభుత్వానికి బిల్లులు పెట్టడం గమనార్హం. దీనికి అప్పటి మైన్స్, ఇరిగేషన్ అధికారులు సహకరించడం, జిల్లా యంత్రాంగంపై ఒత్తిడి తేవడం అందరికీ తెలిసిందే. నాడు బ్రిడ్జిల పక్క నా తవ్వేశారు. ధవళేశ్వరం బ్యారేజి, రోడ్ కం రైలు బ్రిడ్జి, గామన్ వంతెన, హేవలాక్ బ్రిడ్జి ప్రాంతాల్లోనూ యథేచ్ఛగా తవ్వేశారు. గనులు, భూగర్భశాఖకు చెందిన యంత్రాంగం అప్పటి ప్రజాప్రతినిధుల కనుసన్నల్లోనే పనిచేసింది. మైన్స్ అధికారులు ఎన్ని అక్రమాలు జరిగినా పట్టించుకోలేదు.

ఇసుకాసురుల్లో 'సిట్' గుబులు

- వైసీపీలో ఇసుక దోపిడీపై దర్యాప్తు
- వందల కోట్ల ఇసుక తరలింపు
- ప్రేమ్‌రాజ్ బలవన్మరణంపై ఆరా
- సుప్రీం కోర్టుకు తప్పుడు నివేదిక
- డ్రెడ్జింగ్ మతలబుపైనా కన్ను
- యథేచ్ఛగా సాగిన అక్రమాలు
- ఇష్టానుసారంగా అనుమతులు
- నాడు సహకరించిన అధికారులు

వైసీపీలో సిట్ గుబులు..

కూటమి ప్రభుత్వం రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో ఎక్కడ ఎంత మేర ఇసుక దోపిడీ జరిగింది. నాటి ప్రభుత్వానికి ఎంత ఆదాయం వచ్చిందనే అంశంపై లెక్కలు తేల్చి బాధ్యులను గుర్తించేందుకు పోలీసు అధికారులతో ప్రత్యేక సిట్ ఏర్పాటుచేసింది. ఇదిలా ఉండగా కోనసీమ జిల్లా వైసీపీ అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి స్వగ్రామమైన గోపాలపురంలో శనివారం వైసీపీ కోఆర్డినేటర్లు, ఎమ్మెల్సీలు, ఎంపీలతో విందు సమావేశాన్ని నిర్వహించారు. సరిగా అదే సమయానికి ఇసుక అక్రమాలపై సిట్ ఏర్పాటు చేశారన్న సమాచారం తెలుసుకున్న కొందరు నాయకులు ప్రాథమికంగా చర్చించుకున్నట్టు తెలిసింది. మొత్తం మీద జిల్లాలో దోపిడీపై సిట్ ఏర్పాటు అన్న సమాచారం అటు అప్పటి వైసీపీ ప్రతినిధులు, అప్పట్లో కీలకంగా పనిచేసిన పలు శాఖల అధికారుల్లో గుబులు రేపుతోంది.

బ్యాంకు ఖాతాలను ఆధార్‌తో అనుసంధానం చేసుకోవాలి

కలెక్టరేట్ (కాకినాడ), మే 24 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సంక్షేమ పథకాల నగదు బదిలీ కోసం ఖాతాదారులు బ్యాంకు ఖాతాలను ఆధార్‌తో అనుసంధానం చేసుకోవాలని కాకినాడ డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ నవీన్‌కుమార్ కోరారు. రాష్ట్ర ప్రభుత్వం త్వరలో ప్రతిష్టాత్మకంగా అమలుచేసే తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ పథకాలకు నగదును నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాకు జమ చేయడానికి వారి ఖాతాను ఎన్పీసీఐ విధానం కింద ఆధార్‌తో అనుసంధానం చేసుకోవాల్సి ఉంటుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వ అధికారుల సమన్వయంతో జూన్ 5లోగా ఆధార్ సీడింగ్‌తో పాటు ఎన్పీసీఐ లింకేజీ ఖాతాలు, ఖాతాల్లేని వారికి నూతన పోస్టల్ బ్యాంకింగ్ ఖాతాలు తెరుస్తామని చెప్పారు.

రేపు కాకినాడలో జాబ్‌మేళా

కాకినాడ సిటీ, మే 24 (ఆంధ్రజ్యోతి): కాకినాడ వికాస కార్యాలయంలో సోమవారం జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్టు ప్రాజెక్టు డైరెక్టర్ కె.లచ్చారావు ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ కంపెనీల్లో ఆపరేటర్, టెక్నీషియన్ ఉద్యోగాలకు ఎస్‌ఎస్‌సీ, ఇంటర్, ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ, బీటెక్ ఉత్తీర్ణులైన 35 సంవత్సరాలలోపు అభ్యర్థులు అర్హులన్నారు. ఎంపికైన వారికి నెలకు రూ.12 వేల నుంచి రూ.20 వేల వరకు జీతం, ఇన్సెంటివ్స్, భోజనం, వసతి, రవాణా సౌకర్యం ఆయా ఉద్యోగాలకు బట్టి ఉంటుందన్నారు. ఆసక్తిగల వారు సోమవారం ఉదయం 9 గంటలకు కలెక్టరేట్‌లోని వికాస కార్యాలయం వద్దకు సర్టిఫికెట్ల జెరాక్స్‌లతో హాజరు కావాలన్నారు. మరిన్ని వివరాలకు 9392284616 నెంబరును సంప్రదించాలని ఆయన కోరారు.

జీవనోపాధికి వచ్చి జీవచ్ఛవాలుగా మిగిలి..

ఇద్దరు బిహార్ యువకుల మృతి

7



పిఠాపురంలో ఫైర్ స్టేషన్ సెంటర్ వద్ద రోడ్డుపై ప్రవహిస్తున్న వర్షపునీరు

వీడని వర్షం!

ఉదయం వాన.. మధ్యాహ్నం ఎండ

పిఠాపురం, మే24(ఆంధ్రజ్యోతి): వర్షం వీడడం లేదు. ఎండ వెన్నాడుతోంది. ఉక్కపోత ఇబ్బందులకు గురిచేస్తోంది. అరేబియా సముద్రంలో అల్పపీడనం, బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తన ప్రభావంతో రోజూ వర్షాలు పడుతున్నాయి. వేసవిలో అవి తీవ్రంగా ఎండలు కాసే సమయంలో వర్షాలు పడుతుండడంతో ప్రజలు చల్లదనానికి కొంత ఊరట చెందుతున్నా తదనంతరం వాతావరణ పరిస్థితులు ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. వారం రోజులు మాదిరిగానే శనివారం ఉదయం పిఠాపురం పట్టణంలో గంటపాటు వర్షం కురిసింది. దీనితో రహదారులన్నీ జలమయమయ్యాయి. మధ్యాహ్నం నుంచి ఎండ కాసింది. దీంతో వాతావరణం వేడెక్కడంతోపాటు ఉక్కపోత పెరిగింది. ఫలితంగా వృద్ధులు, చిన్నారులు తీవ్ర అవస్థలు పడ్డారు. రాత్రి వరకూ ఇదే పరిస్థితి కొనసాగింది. మరో మూడు నాలుగు రోజులు ఇదే పరిస్థితి ఉంటుందని వాతావరణశాఖ అధికారులు చెబుతున్నారు. మారిన వాతావరణ పరిస్థితులతో జ్వరం, జలుబు, వంటి నొప్పులు, విరోచనాలతో బాధపడుతూ ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులకు వస్తున్న వారి సంఖ్య పెరుగుతోంది.

ఊహించని ప్రమాదం.. అందని పరిహారం..

రామవరానికి చెందిన కొమ్మరాజు హరీష్ ప్రత్తిపాడు బంధువుల ఇంటికి వెళ్లాడు. తెల్లవారుజామున కాలకృత్యాలు తీర్చుకునేందుకు రోడ్డు దాటుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొని వెళ్లిపోయింది. ప్రత్తిపాడు పోలీసులు దీనిపై కేసు నమోదు చేశారు. ప్రమాదానికి కారణమైన వాహనాన్ని గుర్తించలేదు. ఈ ప్రమాదం జరిగి సుమారు ఏడాది కావస్తోంది. అయినా ఆ కుటుంబానికి ఎటువంటి పరిహారం అందలేదు. అతడి కుటుంబసభ్యులు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నారు తప్ప కనికరించేవారు లేరు. వీరే కాదు.. ఇలాంటి గుర్తు తెలియని వాహనాలు ఢీకొని ప్రాణాలు కోల్పోయిన ఎంతోమంది కుటుంబాలు రోడ్డున పడ్డాయి. ఇంటిని నడిపే వారు ప్రమాదంలో మృతి చెందడం.. ప్రభుత్వం నుంచి ఎటువంటి పరిహారం అందకపోవడంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు.

- జిల్లాలో హిట్‌అండ్‌రన్ కేసుల్లో కనిపించని పురోగతి..
- బాధిత కుటుంబాలకు అందని నష్టపరిహారం
- జిల్లాలో 52 కేసులు నమోదు, ముగ్గురికి మాత్రమే సాయం

(కాకినాడ - ఆంధ్రజ్యోతి)

గుర్తు తెలియని వాహనాలు ఢీకొని మృతి చెందిన, గాయాలపాలైన కుటుంబ సభ్యులకు ఎలాంటి పరిహారం అందకపోవడంతో వారంతా ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. ఇలాంటి వారిని ఆదుకునేందుకు కేంద్ర ప్రభుత్వం హిట్ అండ్ రన్ కింద నష్టపరిహారం చెల్లించే కార్యక్రమాన్ని 2022 ఏప్రిల్ 1 నుంచి ప్రారంభించింది. కానీ దీని అమలులో అధికారులు నిర్లక్ష్యం చూపారు. ఇటీవల కాలంలో సుప్రీం కోర్టు దీనిపై ఆగ్రహం వ్యక్తం చేయడంతో అధికారులు కదిలారు. ఈ తరహా బాధితులను గుర్తించి వారిని ఆదుకునేందుకు చర్యలు చేపట్టారు. ఇలా కాకినాడ జిల్లాలో ఇలాంటి కేసులు ఇప్పటి వరకు 52 నమోదయ్యాయి. కలెక్టర్ అనుమతితో వీరికి రావల్సిన పరిహారం కోసం ఇన్సూరెన్స్ కౌన్సిల్‌కు పంపారు. ముగ్గురికి ప్రభుత్వ పరిహారం అందించారు. మిగిలిన వారందరికీ 15 రోజుల్లో అందనున్నాయి. వాస్తవానికి రహదారులపై జరిగే ప్రమాదాల్లో గుర్తు తెలియని వాహనాలు ఢీకొని జరుగుతున్న ప్రమాదాలే అధికమయ్యాయి. ప్రమాదం జరిగిన వెంటనే వాహనాలను అక్కడి నుంచి వేగంగా పోనిస్తున్నారు. వీటిని పట్టుకోవడం పోలీసులకు తలనొప్పిగా మారింది. ప్రమాదానికి కారణమైన వాహనాలను గుర్తించకపోవడంతో బాధితులకు నష్టపరిహారం అందడం లేదు. వాహనాలను గుర్తిస్తే థర్డ్‌పార్టీ ఇన్సూరెన్స్ వస్తుంది. అసలు వాహన ఆచూకీ లేకపోతే ఇలా చాలా మంది ఇబ్బందులు పడాల్సి వస్తుంది. ఇలాంటి కేసులకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం మృతి చెందిన కుటుంబ సభ్యులకు రూ.రెండు లక్షలు, క్షతగాత్రులకు రూ.50 వేలు పరిహారం అందిస్తోంది. బాధితులను గుర్తించే కార్యక్రమాన్ని జిల్లాలో ఇటీవల నిర్వహించారు. వారి నుంచి వివరాలు సేకరించారు.

పరిహారం అందాలంటే..

ప్రమాదాలకు కారణమైన వాహనాలను గుర్తించలేదని సంబంధిత పోలీస్ స్టేషన్ నుంచి సమాచారం ఇవ్వాలి. దీనిని క్లెయిమ్ విచారణ అధికారి పరిశీలిస్తారు. నెల రోజుల్లో నివేదికను క్లెయిమ్ సెటిల్‌మెంట్ కమిషనర్ జిల్లా కలెక్టర్‌కు అందజేస్తారు. ఇక్కడి నుంచి ఇన్సూరెన్స్ కౌన్సిల్‌కు వెళుతుంది. అక్కడి నుంచి బాధితుల ఖాతాలోకి నష్టపరిహారం సొమ్ము అందుతుంది.

అన్ని శాఖల సమన్వయంతో..

'హిట్‌అండ్‌రన్ కేసుల్లో బాధితులను ఆదుకునేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తున్నారు. పోలీసు కేసు మొదలు, వైద్యుడి నుంచి ధ్రువీకరణ, డివిజన్‌స్థాయి అధికారి పరిశీలించి బాధితులకు వీలైనంత త్వరగా పరిహారం అందించేలా చర్యలు తీసుకుంటున్నారు. గుర్తుతెలియని వాహనాలు ఢీకొని జరిగే ప్రమాదాల్లో బాధితులకు ప్రభుత్వం అందిస్తున్న సాయంపై అవగాహన కల్పిస్తున్నాం" అని రవాణా శాఖాధికారులు మాట.

మిల్క్ ట్యాంకర్‌ను ఢీకొన్న ఆటో

ఆటో డ్రైవర్ మృతి, మరొకరికి తీవ్ర గాయాలు



మరణించిన వరప్రసాద్‌కుమార్



మిల్క్ ట్యాంకర్‌ను ఢీకొన్న ఆటో

గొల్లప్రోలు, మే 24 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గొల్లప్రోలు పోలీస్‌స్టేషన్ పరిధి 216 జాతీయ రహదారిపై మిల్క్ ట్యాంకర్‌ను ఆటో ఢీకొన్న ఘటనలో ఆటో డ్రైవర్ మరణించగా, మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. గొల్లప్రోలు మండలం చెందుర్తి గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ మేడిది ధర్మేంద్ర వరప్రసాద్‌కుమార్(34) అలియాస్ నాని, అదే గ్రామానికి చెందిన బి.లోవకుమారి అనే సత్యవతి ఆటోలో పిఠాపురం వస్తున్నారు. గొల్లప్రోలు టోల్‌ప్లాజా దాటిన తర్వాత కత్తిపూడి నుంచి పిఠాపురం వైపు ముందు వెళ్తున్న పాల ట్యాంకర్ సడన్‌బ్రేక్ వేయడంతో పాటు వెనుకనే వస్తున్న ఆటో ఢీకొంది. ప్రమాదంలో వరప్రసాద్ కుమార్ మరణించగా, లోవకుమారికి తీవ్ర గాయాలయ్యాయి. ఆమెను చికిత్స నిమిత్తం పిఠాపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. గొల్లప్రోలు ఎస్‌ఐ ఎన్.రామకృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

'మూకుమ్మడి ఆత్మహత్యలకు పాల్పడతాం'



గోర్సలో తమ భూముల జోలికి రావద్దని హెచ్చరిస్తున్న రైతులు

కొత్తపల్లి, మే 24 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కొత్తపల్లి మండలం గోర్స గ్రామంలో సర్వే నెం.121, 122ల్లో సుమారు 24 ఎకరాల భూమిని దేవదాయ శాఖ అధికారులు స్వాధీనం చేసుకోవడానికి ప్రయత్నిస్తే మూకుమ్మడి ఆత్మహత్యలకు పాల్పడతామని రైతులు హెచ్చరించారు. గోర్సలో సీతారామస్వామి ఆలయ భూములని చెప్తున్న భూములన్నీ తమ పేరునే ఉన్నాయన్నారు. అయితే అవి దేవాలయ భూములంటూ స్వాధీనం చేసుకుంటామని అధికారులు హెచ్చరించడంపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఎన్నో ఏళ్లుగా ఈ భూములు తమ స్వాధీనంలో ఉన్నాయని, వాటికి పన్నులు కూడా చెల్లిస్తున్నామన్నారు. తమ పేరున ఉన్న భూములను కుమార్తెలకు కట్నకానుకలుగా ఇచ్చి పెళ్లిళ్లు చేశామన్నారు. మిగిలిన భూములపై వచ్చే ఆదాయంతో జీవనోపాధి పొందుతున్నామన్నారు. ఇప్పుడా భూములను దౌర్జన్యంగా స్వాధీనం చేసుకోవాలని చూస్తే ఆత్మహత్యలకు పాల్పడడమే శరణ్యమని వారు హెచ్చరించారు.

గోర్స సీతారామస్వామి ఆలయ భూములను స్వాధీనం చేసుకుంటామని అధికారులు మోసం చేశారని సర్పంచ్ రొంగల వీరబాబు ఆధ్వర్యంలో గ్రామస్తులు ఆరోపించారు. సర్వే నెం.121, 122ల్లో గల భూములను శనివారం రైతుల నుంచి స్వాధీనం చేసుకుంటామని దేవదాయ శాఖ అధికారులు గ్రామస్తులు, ప్రజలకు సమాచారం ఇచ్చారన్నారు. ఈ క్రమంలో ఆసుపత్రికి తరలించేందుకు అంబులెన్స్‌లను సిద్ధం చేశారన్నారు. అయితే ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ఏ అధికారీ గోర్స వచ్చిన దాఖలాలు లేవన్నారు. ఏ సమాచారం ఇవ్వకుండా తమను మోసం చేశారని, ఈ విషయమై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని తెలిపారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి



మరణించిన సుంకర రాజు

జగ్గంపేట, మే 24 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా జగ్గంపేటలో విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి చెందాడు. కాకినాడ జిల్లా కిర్లంపూడి మండలం సోమవరం గ్రామానికి చెందిన సుంకర రాజు(35) 10 ఏళ్లుగా జగ్గంపేటలో నివాసం ఉంటున్నాడు. బాలాజీనగర్‌లో ఓ ఇంట్లో వారం రోజుల నుంచి తాపీ పని చేస్తుండగా శనివారం స్లాబ్ నిమిత్తం సెంట్రింగ్ వేస్తుండగా వర్షం పడడంతో విద్యుత్ షాక్ కొట్టడంతో కింద పడిపోయాడు. దీంతో స్థానికులు ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులున్నారు. మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ రఘునందరావు తెలిపారు.

పేకాడుతున్న ఆరుగురి అరెస్ట్

తుని రూరల్, మే 24 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా తుని మండలం తలుపులమ్మ లోవ దేవస్థానం పరిసర ప్రాంతాలైన ప్రైవేట్ వసతి గృహాలు, సమీప మామిడి తోటల్లో గుట్టుచప్పుడు కాకుండా సాగుతున్న పేకాట శిబిరాలపై పోలీసులు దాడి చేశారు. ఆరుగురిని అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.3800 నగదు స్వాధీనపరుచుకున్నట్టు ఎస్‌ఐ కృష్ణమాచార్యులు తెలిపారు. పేకాట, గుండాట వంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

అక్రమంగా మద్యం తరలిస్తున్న నలుగురి అరెస్టు

తాళ్లరేవు, మే 24 (ఆంధ్రజ్యోతి): యానాం నుంచి మద్యాన్ని అక్రమంగా ఆంధ్రా ప్రాంతానికి తరలిస్తున్న నలుగురు వ్యక్తులను అరెస్టు చేసి మద్యం స్వాధీనం చేసుకున్నట్టు ఎక్సైజ్ సీఐ కోటేశ్వర్ శనివారం తెలిపారు. డిప్యూటీ కమిషనర్ వై.చైతన్యమురళీ ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి ఎక్సైజ్ అధికారులు కాకినాడ జిల్లా తాళ్లరేవు మండలం పోలేకుర్రు ఎక్సైజ్ చెక్ పోస్టు వద్ద జరిపిన దాడుల్లో నలుగురు పట్టుబడ్డారు. వారి నుంచి 2 కార్లు, ఒక మోటారుసైకిల్, 50మద్యం బాటిల్స్‌ను స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపించినట్టు సీఐ తెలిపారు. దాడుల్లో సీఐతో పాటు ఎస్‌ఐ నాగేంద్రకృష్ణ తదితరులు ఉన్నారు.

ఈఏపీసెట్ ఇంజనీరింగ్ పరీక్షకు 2,202 మంది హాజరు

కన్వీనర్ వీవీ సుబ్బారావు

జేఎన్టీయూకే, మే 24 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జేఎన్టీయూ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఏపీఈఏపీసెట్-2025 ఇంజనీరింగ్ ఆన్‌లైన్ ప్రవేశ పరీక్ష శనివారం కాకినాడ, తూర్పుగోదావరి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాల్లో ప్రశాంతంగా జరిగిందని కన్వీనర్ వీవీ సుబ్బారావు తెలిపారు. మూడు జిల్లాల్లోని తొమ్మిది కేంద్రాల్లో ఉదయం 9నుంచి 12 గంటల వరకు నిర్వహించిన పరీక్షకు మొత్తం 2,296 మంది విద్యార్థులకు 2,202 మంది హాజరుకాగా 94 మంది గైర్హాజరయ్యారు. కాకినాడ జిల్లాలో 95.67శాతం, తూర్పుగోదావరి జిల్లాలో 96.17 శాతం, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 95.78 శాతం హాజరు నమోదైంది. ఇంజనీరింగ్ విభాగం పరీక్షలు ఆదివారం కూడా కొనసాగుతాయి. ఏపీ ఇంటర్ రెగ్యులర్ విద్యార్థులు మినహా సీబీఎస్, ఐసీఎస్ఈ, ఏపీవోఎస్ఎస్, ఎన్ఐవోఎస్, డిప్లొమా, ఇతర బోర్డులకు చెందిన విద్యార్థులు తమ ఇంటర్ మార్కులను ఏపీఈఏపీసెట్ https://cets.apsche.ap.gov.in వెబ్‌సైట్ ద్వారా డిక్లరేషన్ ఫారంలో ఈనెల 30వ తేదీలోపు అప్‌లోడ్ చేయాలని కన్వీనర్ సూచించారు.

పిల్లల కళ్లెదుటే తల్లిదండ్రులు దుర్మరణం



ఘటనా స్థలంలో దుర్గాప్రసాద్, సిరి మృతదేహాలు

లారీ రూపంలో మృత్యువు

తూర్పుగోదావరి జిల్లా దేవరపల్లి డైమండ్ జంక్షన్ వద్ద ఘటన

గోకవరం మండలం గోపాలపురంలో విషాదఛాయలు



పోలీస్‌స్టేషన్ వద్ద విలపిస్తున్న చిన్నారులు





దుర్గాప్రసాద్, సిరి దంపతుల ఫైల్‌ఫొటోలు

దేవరపల్లి, మే 24(ఆంధ్రజ్యోతి): పిల్లలు కాలకృత్యాల కోసం ద్విచక్రవాహనాన్ని రోడ్డుపక్కన ఆపిన తల్లిదండ్రులను మృత్యువు లారీ రూపంలో కబళించింది. దీంతో వారిద్దరూ అక్కడికక్కడే మృతిచెందిన హృదయ విదారకర ఘటన తూర్పుగోదావరి జిల్లా దేవరపల్లి డైమండ్ జంక్షన్ సమీపంలో శనివారం జరిగింది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలివి.. తూర్పుగోదావరి జిల్లా గోకవరం మండలం గోపాలపురం గ్రామానికి చెందిన తొంటా దుర్గాప్రసాద్ (32), తొంటా సిరి (29) భార్యభర్తలు. వారికి 11ఏళ్ల కుమార్తె ప్రవల్లిక, 9ఏళ్ల కుమారుడు ఇమ్మానుయేల్ ఉన్నారు. దుర్గాప్రసాద్ తాపీ మేస్త్రీగా, అతడి భార్య సిరి అంగన్వాడీ టీచర్‌గా పనిచేస్తున్నారు. దుర్గాప్రసాద్ అన్నయ్య తొంటా మునలయ్య దేవరపల్లి మండలం యాద వోలులో ఉండడంతో సెలవులు వచ్చినప్పుడల్లా ఇక్కడికి వస్తుంటారు. దానిలో భాగంగా శనివారం గోపాలపురం నుంచి యాదవోలు బయల్దేరారు. మార్గమధ్యంలో దేవరపల్లి డైమండ్ జంక్షన్‌కు వచ్చేసరికి పిల్లలకు టాయిలెట్స్ నిమిత్తం వాహనాన్ని రోడ్డుపక్కన ఆపారు. ఈ క్రమంలో దుర్గాప్రసాద్, అతడి భార్య బండి వద్ద నిల్చొని తన వెంట తెచ్చుకున్న మామిడికాయల సంచిను సరిచేస్తుండగా రాజమండ్రి వైపు నుంచి ఏలూరు వైపు వెళ్తున్న లారీ అతివేగంతో ఢీ కొని వారిపై నుంచి దూసుకెళ్లడంతో అక్కడి కక్కడే మృతిచెందారు. పిల్లల కళ్ల ముందే ఈ ఘోర సంఘటన జరగడంతో వారితో పాటు బంధువులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. ఘటనా స్థలాన్ని సీఐ నాగేశ్వర్‌నాయక్, ఎస్‌ఐ సుబ్రహ్మణ్యం పరిశీలించారు. మృతదేహాలను గోపాలపురం ప్రాథమిక ఆరోగ్యకేంద్రానికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. నిర్లక్ష్యంగా వాహనం నడిపి ఈ ఘటనకు కారణమైన లారీ డ్రైవర్ చర్లపల్లికి చెందిన శ్రీశైలంనుపోలీసులు అరెస్ట్ చేశారు.

విద్యుదాఘాతానికి ముగ్గురు బలి

విజయవాడలో దుర్ఘటన

మృతుల్లో ఇద్దరు రాజమండ్రి వాసులు



ఘటనాస్థలిలో మృతదేహాలు

విజయవాడ, మే 24 (ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతం ముగ్గురిని బలి తీసుకుంది. ఒకరిని కాపాడేందుకు మరొకరు ప్రయత్నించి ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటన విజయవాడలోని బెంజిసర్కిల్ సమీపాన ఉన్న నారా చంద్రబాబు నాయుడు కాలనీలో శనివారం జరిగింది. విజయవాడకు చెందిన పెరవళి రామకనక దుర్గాప్రసాద్ ఐటీఐ విశ్రాంత ప్రిన్సిపాల్. ఆయన పేరున నారా చంద్రబాబు నాయుడు కాలనీలో సాయి టవర్స్ జీఎఫ్2 ఫ్లాట్ ఉంది. ఇందులో ఆయన సతీమణి పెరవళి ముత్యావలి ఉంటున్నారు. అయితే కొన్నాళ్లక్రితం ఇద్దరూ విడిపోయి వేర్వేరుగా ఉంటున్నారు. ఈ ఫ్లాట్‌లో మాత్రం ముత్యావలి నివసిస్తున్నారు. దుర్గాప్రసాద్ చేసిన అప్పులు తీర్చకపోవడంతో ఇంటిని కోర్టు జప్తు చేసింది. ఈ ఫ్లాట్‌ను ఖాళీ చేయాలని అడ్వకేట్ కమిషన్ ఈనెల 16న నోటీసు అంటించింది. ఈ ఫ్లాట్‌లో ముత్యావలి ఉం టుండగా, దుర్గాప్రసాద్ పెన మలూరు మండలం పోరంకిలో వేరుగా ఉంటున్నారు. ఇంటిని ఖాళీ చేయాల్సి రావడంతో ముత్యావలి అన్నయ్య తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరానికి చెందిన సలాది ప్రసాద్, ఆయన సతీమణి ఊటుకూరి రాధ కొద్దిరోజుల క్రితం ఇక్కడికి వచ్చారు. ఫ్లాట్ ఖాళీ చేయాల్సి రావడంతో సామాన్లు పార్శిల్ చేసుకున్నారు. శనివారం ఉదయం ప్రసాద్ కుళాయి వద్ద దుస్తులు ఉతుకుతుండగా, ఆయన సోదరి ముత్యావలి తీగపై ఆరేస్తుంది. గుమ్మం ఎదురుగా ఉన్న జియో తీగపై దుస్తులు వేస్తుండగా, విద్యుదాఘాతానికి గురైంది. కుళాయి వద్ద ఉన్న ప్రసాద్ పక్కనే ఉన్న వాచ్‌మెన్ కుమార్తె ప్రభావతిని పిలిచాడు. ఆమె పైఅంతస్తులో ఉన్నవారిని పిలవడానికి వెళ్లింది. ఇంతలో ప్రసాద్ తన సోదరిని కాపాడుకునేందుకు తడి చేతులతో పట్టుకోవడంతో ఆయన కూడా విద్యుదాఘాతానికి గురయ్యాడు. భర్త ప్రసాద్ పెద్దగా కేకలు వేయడంతో ఇంట్లో ఉన్న భార్య రాధ కూడా ఆయన్ను రక్షించే ప్రయత్నం చేయడంతో ఆమెకు కూడా షాక్ తగిలింది. గుమ్మానికి ఎదురుగా ముత్యావలి, ప్రసాద్ పడిపోగా, కొద్దిదూరంలో రాధ పడిపోయింది. కేకలు విని చుట్టుపక్కల వారు వచ్చి వెంటనే ఫ్యూజులు లాగేశారు. అప్పటికే ముగ్గురూ ప్రాణాలు కోల్పోయారు. ఘటనా స్థలాన్ని అడ్మిన్ డీసీపీ కేజీవీ సరిత, సెంట్రల్ జోన్ ఏసీపీ కె.దామోదర్, పటమట ఇన్‌స్పెక్టర్ వి.పవన్‌కిషోర్ పరిశీలించారు. విద్యుత్‌శాఖ సిబ్బంది ఘటనాస్థలాన్ని తనిఖీ చేశారు.

జీవనోపాధికి వచ్చి జీవచ్ఛవాలుగా మిగిలి..

ఇద్దరు బిహార్ యువకుల మృతి

2 మైనింగ్ లారీలు ఢీకొనడంతో ప్రమాదం

కాకినాడ జిల్లా ప్రత్తిపాడులో ఘటన





ప్రమాదంలో మృతిచెందిన బిహార్ యువకులు

ప్రత్తిపాడు, మే 24 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం వంతాడ లేటరైట్ మైనింగ్ కొండ వద్ద శనివారం రాత్రి రెండు మైనింగ్ లారీలు ఢీకొన్న ఘటనలో ఇద్దరు యువకులు మృతిచెందారు. వారిని బిహార్ రాష్ట్రానికి చెందిన వారిగా గుర్తించారు. ప్రత్తిపాడు పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి... మండలంలోని వంతాడ లేటరైట్ మైనింగ్ పనుల్లో బీహార్ రాష్ట్రానికి చెందిన ధీరజ్‌కుమార్ (23), చందన్‌కుమార్ (21) పని చేస్తున్నారు. వారిద్దరూ శనివారం రాత్రి విధులు ముగించుకుని కొండపై నుంచి కిందకు వచ్చే మైనింగ్ లారీలో ప్రయాణిస్తున్నారు. అలాగే కొండ దిగువ నుంచి కొండపైకి వెళ్తున్న మరో మైనింగ్ లారీ పరస్పరం కొండ దిగువన గల యార్డు సమీపంలో ఢీకొన్నాయి. లారీలు నుజ్జునుజ్జు అయ్యాయి. పైనుంచి వస్తున్న లారీలో ఉన్న ధీరజ్‌కుమార్, చందన్‌కుమార్ మృతిచెందారు. వారి మృతదేహాలను శనివారం రాత్రి పది గంటల సమయంలో పోస్టుమార్టం నిమిత్తం ప్రత్తిపాడు ప్రభుత్వాసుపత్రికి తీసుకొచ్చారని సూపరింటెండెంట్ డాక్టర్ సౌమ్యమైఖేల్ తెలిపారు. ప్రత్తిపాడు ఎస్‌ఐ ఎస్.లక్ష్మీకాంతం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. జీవనోపాధి కోసం బిహార్ నుంచి వచ్చిన వారు మృతి చెందడంతో స్థానికంగా విషాదం అలముకుంది.



నుజ్జునుజ్జయిన లారీ

తుల్యభాగ డ్రెయిన్‌లోకి దూకి

ఎస్‌ఎంసీ చైర్మన్ ఆత్మహత్యాయత్నం



దూకిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న పోలీసులు



కొలిశెట్టి సత్యం (ఫైల్ ఫొటో)

కరప, మే 24 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కరప మండలం గొర్రిపూడి వంతెన పైనుంచి ఒక వ్యక్తి తుల్యభాగ డ్రెయిన్‌లోకి దూకి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. స్థానికులు, కరప పోలీసులు తెలిపిన సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి... కాజులూరు మండలం గొల్లపాలేనికి చెందిన కొలిశెట్టి సత్యం (42) స్థానికంగా విజయభవాని పలావు సెంటర్ నిర్వహిస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. గొల్లపాలెం జిల్లా పరిషత్ హైస్కూల్‌కు ప్రతిష్ఠాత్మకంగా జరిగిన ఎస్‌ఎంసీ ఎన్నికల్లో అత్యధిక మెజార్టీతో గెలిచిన సత్యం చైర్మన్‌గా వ్యవహరిస్తున్నాడు. ఆయనకు భార్యతో పాటు టెన్త్, ఇంటర్ చదువుతున్న ఇద్దరు కుమారులు ఉన్నారు. శనివారం రాత్రి సత్యం గొర్రిపూడి వంతెన వద్దకు వచ్చి చెప్పులు విడిచి ఒక్కసారిగా తుల్యభాగ డ్రెయిన్‌లోకి దూకేశాడు. అక్కడే ఉన్న స్థానికులు వెంటనే స్పందించి కరప పోలీసులకు సమాచారం అందించారు. ఎస్‌ఐ తోట సునీత ఘటనా స్థలికి చేరుకుని విచారణ చేపట్టారు. చీకటి పడడంతో లైట్లను ఏర్పాటు చేసి గజ ఈతగాళ్లతో గాలింపు చర్యలు చేపట్టారు. స్థానిక మత్స్యకారులు బోట్లపై నుంచి వలలు విసిరి సత్యం ఆచూకీ కోసం ప్రయత్నించారు. కాకినాడ జగన్నాయక్‌పూర్ ఫైర్ స్టేషన్ నుంచి సిబ్బంది వచ్చి తుల్యభాగ డ్రెయిన్లో విస్తృతంగా గాలించినా ఆచూకీ లభ్యం కాలేదు. నీటి ప్రవాహం అధికంగా ఉండడంతో పాటు చీకటి పడడంతో ఆదివారం ఉదయం రెస్క్యూ టీమ్ సహాయంతో మరలా గాలింపు చర్యలు చేపడతామని పోలీసులు తెలిపారు. భార్యభర్తల మధ్య తలెత్తిన గొడవ కారణంగా సత్యం క్షణికావేశంలో డ్రెయిన్ లోకి దూకేసినట్టు స్థానికులు భావిస్తున్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు కరప పోలీసులు కేసు నమోదు చేశారు.

హ్యాండ్లూమ్ టెక్నాలజీ డిప్లొమాలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

కాకినాడ చేనేత, జౌళి శాఖ అధికారి

కార్పొరేషన్ (కాకినాడ), మే 24 (ఆంధ్రజ్యోతి): తిరుపతి జిల్లా వెంకటగిరిలోని ప్రగడ కోటయ్య మెమోరియల్ ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీ ఆధ్వర్యంలో హ్యాండ్లూమ్ టెక్నాలజీలో మూడేళ్ల డిప్లొమా కోర్సులో శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని కాకినాడ జిల్లా చేనేత, జౌళి శాఖ అధికారి కె.పెద్దిరాజు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. డిప్లొమా కోర్సులో శిక్షణఇచ్చి కేంద్ర ప్రభుత్వ జౌళిశాఖ ద్వారా సర్టిఫికెట్ జారీ చేస్తామని తెలిపారు. టెన్త్ ఉత్తీర్ణులైన అభ్యర్థులకు వారి మార్కుల మెరిట్ ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తారన్నారు. ఇంటర్ ఎంపీసీ, ఐటీఐ ఉత్తీర్ణులైన వారు నేరుగా రెండు సంవత్సరంలో చేరవచ్చన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిబంధనల మేరకు నెలకు రూ.2,500 స్టైఫండ్ పొందేందుకు అర్హులని తెలిపారు. క్యాంపస్ సెలక్షన్స్ ఉద్యోగ అవకాశాలు కల్పిస్తారన్నారు. ఈకోర్సుచేసిన తర్వాత బీటెక్ రెండో సంవత్సరంలో నేరుగా ప్రవేశించవచ్చన్నారు. వివరాలకు కాలేజీ వైబ్‌సైట్‌ను, 9866169908, 901024 3054ను సంప్రదించవచ్చన్నారు. దరఖాస్తుల స్వీకరణకు జూన్ 1 ఆఖరి తేదీ అని ఆయన తెలిపారు.

ఇదేమి 'పని'తనం!

పనిచేస్తున్న ఇళ్లకే కన్నం వేసిన పని మనుషులు

- కాకినాడలో మహిళ అరెస్ట్

22 కాసుల బంగారు ఆభరణాలు, వెండి వస్తువుల స్వాధీనం

- సామర్లకోటలో రూ.6 లక్షల విలువైన బంగారు ఆభరణాలతో మహిళ అరెస్ట్

కాకినాడ క్రైం, మే 24 (ఆంధ్రజ్యోతి): నమ్మకంగా ఓ ఇంట్లో పని చేస్తూ యజమానురాలు లేని సమయంలో ఆ ఇంటిని కొల్లగొట్టిన పని మనిషి కాకినాడ టూటౌన్ పోలీసులకు దొరికిపోయింది. వివరాలు ఇలా ఉన్నాయి... కాకినాడ విద్యుత్‌నగర్ ఎస్‌బీఐ కాలనీలో నివసిస్తున్న వి.మణి కలెక్టరేట్ ప్రాంగణంలోని వికాస సంసలో మేనేజర్‌గా పనిచేస్తోంది. ఆమె శుక్రవారం ఉదయం 10.30 గంటలకు ఇంటికి తాళం వేసి విధులకు హాజరై సాయంత్రం 5.30 గంటలకు వచ్చింది. బీరువాలో ఉన్న 22 కాసుల బంగారు ఆభరణాలు, ఇతర వెండి వస్తువులు చోరీకి గురైనట్టు గుర్తించి వెంటనే టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. టూటౌన్ సీఐ మజ్జి అప్పలనాయుడు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కాగా మణి ఆఫీసుకు వెళ్లేటప్పుడు ఒకచోట తాళం పెట్టి వెళ్తుంది. ఇది తెలిసిన పని మనిషి రమ్య యజమాని వెళ్లగానే ఆ తాళం తీసుకుని ఇంట్లోకి వెళ్లి బీరువాలో ఉన్న బంగారు ఆభరణాలు, వెండి వస్తువులను తీసుకుని ఉడాయించింది. అన్ని కోణాల్లో దర్యాప్తు చేపట్టిన పోలీసులు రమ్యను అదుపులోకి తీసుకుని తమదైన శైలిలో విచారించారు. తానే ఆభరణాలను దొంగిలించినట్టు ఒప్పుకోవడంతో వాటిని స్వాధీనం చేసుకుని మణికి అప్పగించారు. కేసును ఛేదించిన సీఐ అప్పలనాయుడు, సిబ్బందిని ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

సామర్లకోటలో....

సామర్లకోట, మే 24 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా సామర్లకోటలో సింగవరపు సత్యనారాయణ ఇంటిలో ఇటీవల జరిగిన చోరీ సంఘటనలో సామర్లకోట పోలీసులు దర్యాప్తు మేరకు ఇంటిలో పనిచేస్తున్న వీర్రాఘవపురానికి చెందిన బొడ్డు దుర్గాదేవిని విచారించగా చోరీకి గురైన రూ.6 లక్షల విలువైన బంగారపు ఆభరణాలు, 17 చిన్న డైమండ్స్, స్మార్ట్ వాచ్‌ను స్వాధీనం చేసుకున్నట్టు శనివారం రాత్రి సీఐ కృష్ణభగవాన్ విలేకర్లకు తెలిపారు. అంబటి వారి తోటలోని సత్యనారాయణ ఇంటిలో జరిగిన ఈ చోరీపై సత్యనారాయణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు జిల్లా ఎస్పీ బిందుమాధవ్ ఆదేశాల మేరకు పోలీసులు దర్యాప్తు చేశారు. ఇంటిలోనే పనిమనిషిగా పని చేస్తున్న దుర్గాదేవిని అనుమానించి పోలీసులు తమదైన కోణంలో దర్యాప్తు నిర్వహించడంతో తానే చోరీకి పాల్పడినట్లు అంగీకరించడమే గాక ఆమె ఇంటిలో దాచి ఉంచిన ఆభరణాలు తదితర చోరీ సొత్తును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కాగా దుర్గాదేవిని అరెస్ట్ చేసి రిమాండ్ నిమిత్తం కోర్టు ఎదుట హాజరుపర్చనున్నట్టు సీఐ తెలిపారు. ప్రతీ ఇంటి యజమానులు ఇల్లు విడిచి వేరే ప్రాంతాలకు వెళ్లినపుడు ఎల్‌హెచ్ఎంఎస్ తప్పనిసరిగా వాడాలని సూచించారు. అలాగే ఇంటిలో పనిమనుషులను పెట్టుకున్న పుడు వారి కదలికలపై నిఘా ఉంచాలని తెలిపారు.



కాకినాడ జిల్లా సామర్లకోటలో వివరాలు వెల్లడిస్తున్న సీఐ కృష్ణభగవాన్

రత్నగిరిపై భక్తుల సందడి

రూ.50 లక్షల ఆదాయం

అన్నవరం, మే 24 (ఆంధ్రజ్యోతి): రత్నగిరివాసుడైన సత్యదేవుడి సన్నిధి శనివారం భక్తులతో పోటెత్తింది. వైశాఖమాసం వివాహ ముహూర్తాల్లో శుక్రవారం చివరి ముహూర్తం కావడంతో సత్యదేవుడి సన్నిధిలో వివాహం చేసుకున్న జంటలతో పాటుగా వివిధ ప్రాంతాల్లో ఒక్కటైన నూతన జంటలు తమ బృందాలతో స్వామివారి సన్నిధిలో వ్రతాలు ఆచరించారు. శనివారం ఒక్కరోజు సుమారు 4వేల వ్రతాలు జరగ్గా వివిధ విభాగాల ద్వారా సుమారు రూ.50లక్షలు ఆదాయం సమకూరింది.

'ప్రసాద్ స్కీం' పనులకు టెక్నికల్ బిడ్‌లో ఆరుగురు

భక్తులకు మెరుగైన సౌకర్యాల కల్పన కోసం కేంద్రప్రభుత్వ పథకం ప్రసాద్‌స్కీం పనులకు దశాబ్దకాలంగా అవాంతరాలు ఎదురవుతున్నాయి. గతనెలలో టెండర్లు పిలిచి ఫైనల్‌చేసిన అనంతరం సింహాచలం దేవస్థానంలో చందనోత్సవ ఏర్పాట్లలో నిర్మాణంకూలి పలువురు మృతి చెందిన ఘటనలో అన్నవరం పనులు దక్కించుకున్న గుత్తేదారు సంస్థ అక్కడ గోడనిర్మించిన సంస్థ ఒక్కటే కావడంతో ప్రభుత్వం ఆ సంస్థను బ్లాక్‌లిస్ట్‌లో పెట్టింది. దీంతో టూరిజం అధికారులు షార్టుటెండర్ నోటిఫికేషన్ జారీచేశారు. శనివారం తెరిచిన టెక్నికల్ బిడ్‌లో ఆరుగురు గుత్తేదారులు టెండర్లలో పాల్గొన్నారని, ఫైనాన్స్ బిడ్‌ను తెరిచి టెండర్ల ఖరారు ప్రక్రియ పూర్తి చేస్తామని టూరిజంశాఖ అధికారులు తెలిపారు. ఫైనాన్స్‌బిడ్‌లు సోమవారం ఓపెన్ చేయనున్నట్టు వారు స్పష్టం చేశారు.

అమలాపురంలో...

నేడు పవర్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్

ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల స్థాయిలో నిర్వహణ

అమలాపురం టౌన్, మే 24(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం సర్‌సీవీ రామన్ స్కూలు ఆవరణలో ఆదివారం ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల స్థాయి పవర్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్-2025 పోటీలు నిర్వహిస్తున్నట్టు అమలాపురం హెల్త్ అండ్ ఫిట్‌నెస్ జిమ్ కోచ్ కంకిపాటి వెంకటేశ్వరరావు తెలిపారు. మూడో పవర్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్ పోటీలకు ఉభయ గోదావరి జిల్లాల నుంచి 130మందికి పైగా పవర్ లిఫ్టర్లు ఇప్పటికే తమ పేర్లను నమోదు చేయించుకున్నారు. మెన్, ఉమెన్, మాస్టర్స్ విభాగాల్లో పోటీలు జరుగుతాయి. 53 కిలోలు, 59, 66, 74, 83, 93, 105 కిలోలు, 105 కిలోలు పైబడిన విభాగాల్లో వేర్వేరుగా పోటీలను నిర్వహిస్తామన్నారు. అమలాపురం హెల్త్ అండ్ ఫిట్‌నెస్ జిమ్ స్పోర్ట్స్ క్లబ్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ పోటీలు జరుగుతాయని ఆయన తెలిపారు.

5 నుంచి అప్పనపల్లి బాలబాలాజీ కల్యాణోత్సవాలు

నేడు పందిరిరాట

మామిడికుదురు, మే 24 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అప్పనపల్లి బాలబాలాజీ వార్షిక కల్యాణోత్సవాలు జూన్ 5వ తేదీ నుంచి ప్రారంభమవుతాయని సహాయ కమిషనర్ ఎం.సత్యనారాయణరాజు తెలిపారు. కల్యాణోత్సవాలను పురస్కరించుకుని ఈనెల 25న ఆదివారం ఉదయం 11.30గంటలకు పందిరి రాట ముహూర్తం చేయనున్నట్టు తెలిపారు. 5వ తేదీ గురువారం నుంచి 9వ తేదీ సోమవారం వరకు కల్యాణోత్సవాలను నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. ఆలయాన్ని సర్వాంగ సుందరంగా అలంకరిస్తున్నారు. భక్తులు స్వామి కల్యాణోత్సవాలను వీక్షించి ప్రసాదాలు స్వీకరించాలని సహాయ కమిషనర్ కోరారు.

కాకినాడ

• కాకినాడ సిటీ • రూరల్ • పిఠాపురం • పెద్దాపురం

ఎఫ్‌సీఐ రాష్ట్ర సలహా కమిటీ సభ్యుడిగా వికాస్



సర్పవరం జంక్షన్, మే 24 (ఆంధ్రజ్యోతి): కాకినాడ రూరల్ మండలం రమణయ్యపేట ఏపీఎస్పీకి చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ మద్దా వికాస్‌ను కేంద్ర ప్రభుత్వం ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎఫ్‌సీఐ) ఏపీ రాష్ట్ర సలహా కమిటీ సభ్యుడిగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. వికాస్ జాతీయ ఉత్తమ అవార్డు గ్రహీత, రిటైర్డు హెచ్‌ఎం మద్దా కృష్ణమూర్తి కుమారుడు.



ఆర్ఆర్‌బీ చెరువు ప్రధాన కళింగల్ గేట్లు శిథిలం కావడంతో ఇసుక బస్తాలతో వేసిన అడ్డుకట్ట

ఏళ్ల తరబడి నిర్లక్ష్యం

» మల్లవరం ఆర్ఆర్‌బీ చెరువు నిర్వహణను పట్టించుకోని వైనం

» 20వేల ఎకరాలకు సాగునీరు ప్రశ్నార్థకం

గొల్లప్రోలు రూరల్, మే 24 (ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలు, తొండంగి మండలాల్లో 20వేల ఎకరాలకు సాగునీరు అందించే గొల్లప్రోలు మండలం మల్లవరంలోని ఆర్ఆర్‌బీ చెరువు నిర్వహణపై ఏళ్ల తరబడి నిర్లక్ష్యం ప్రదర్శించడంతో పొలాలకు సాగునీరు అందడం ప్రశ్నార్థకంగా మారింది. 1,350 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఈ చెరువు ప్రధాన కళింగల్‌తో పాటు పొలాలకు సాగునీరు సరఫరా అయ్యే తూములన్నీ శిథిలావస్థకు చేరాయి. వరదలకు ప్రధాన కళింగల్ గేట్లు, కట్టడాలు కొట్టుకుపోగా ఎనిమిదేళ్లుగా ఇసుక బస్తాలతో తాత్కాలిక అడ్డుకట్టలు వేసి సాగునీరు మళ్లించుకుంటున్నారు. వైసీపీ హయాంలో కళింగల్స్, తూముల మరమ్మతులకు రూ.1.20కోట్లతో అంచనాలు రూపొందించి నాలుగుసార్లు టెండర్లు పిలిచినా పనుల నిర్వహణకు ఎవరూ ముందుకు రాలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కాల్వల పనులు మినహా కళింగల్స్, స్లూయిస్‌లు, రెగ్యులేటర్ల మరమ్మతులకు ప్రాధాన్యమివ్వలేదు. ప్రస్తుతం ప్రతిపాదించిన క్లోజర్ పనులను వీటిని మినహాయించి రెండో దశలో మంజూరు చేస్తామని ప్రకటించడంతో ఈ ఏడాది పనులు సాధ్యమయ్యేలా కనిపించట్లేదు. కళింగల్స్ శిథిలావస్థకు చేరడంతో కాలువల ద్వారా నీరు వృథాగా పోతోంది. దీంతో సార్వా, దాళ్వా పంటలకు సాగునీరు అందాలంటే ఏలేరు, పీబీసీ కాలువల ద్వారా సాగునీరు మళ్లించాల్సిన దుస్థితి నెలకొంది. కళింగల్స్, తూముల మరమ్మతులు చేపట్టకుంటే పొలాలు సాగునీరు చేరడం కష్టమేనని రైతులు చెప్తున్నారు.

పట్టు రైతుల సమస్యల పరిష్కారానికి చర్యలు

● జిల్లా పట్టు పరిశ్రమ అధికారి పాల్‌రాజు



సమావేశంలో పాల్గొన్న జిల్లా పట్టు పరిశ్రమ అధికారి పాల్‌రాజు

గొల్లప్రోలురూరల్, మే 24(ఆంధ్రజ్యోతి): పట్టు రైతుల సమస్యలను ప్రభుత్వానికి, సెరికల్చర్ కమిషనరు దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని జిల్లా పట్టు పరిశ్రమశాఖ అధికారి ఎ.పాల్‌రాజు తెలిపారు. గొల్లప్రోలు మండలం చేబ్రోలు సెరికల్చర్ ఫామ్‌లో శనివారం ఆయన పట్టు రైతులతో సమావేశం నిర్వహించారు. ఇక్కడ మార్కెట్ షెడ్ పూర్తిచేసేందుకు రూ.35 లక్షలు అవసరమని ప్రతిపాదనలు పంపగా నిధులు మంజూరయ్యాయని తెలిపారు. ఇతర సమస్యలు, ఇన్సెంటివ్, బకాయిలు త్వరితగతిన వచ్చేలా చర్యలు చేపడతామని చెప్పారు. పట్టు రైతులు తమ సమస్యలను వివరించారు. రైతులకు వ్యతిరేకంగా పనిచేస్తూ తమ సమస్యలను పట్టించుకోని పట్టు పరిశ్రమశాఖ డీడీ గీతారాణిని తక్షణం బదిలీ చేయాలని రైతులు ముక్తకంఠంతో డిమాండ్ చేశారు. నాలుగు సంవత్సరాలుగా రావాల్సిన రూ.1కోట్ల ఇన్సెంటివ్ బకాయిలు విడుదల చేయాలని, గతంలో మాదిరిగా అన్ని ప్రోత్సాహకాలు ఇవ్వాలని కోరారు. సమస్యలను పరిష్కరించకుంటే భవిష్యత్తు కార్యాచరణ నిర్ణయించుకుంటామని అధికారులకు తేల్చిచెప్పారు. సమావేశంలో చేబ్రోలు సెరికల్చర్ ఆఫీసర్ టి.మోసయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌బీ పట్నంలో రైతు సదస్సు

పెద్దాపురం, మే24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాయభూపాలపట్నంలో ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో శనివారం రైతు సదస్సు నిర్వహించారు. ఉద్యాన పంటల సాగులో ఆశించే చీడపీడలు మొదలైన విషయాలపై శాస్త్రవేత్తలు డాక్టర్ సునీత, జానకి రైతులకు అవగాహన కల్పించారు. అధిక దిగుబడులు సాధించేందుకు మెళకువలను వివరించారు. ఉద్యాన శాఖ అసోసియేట్ డీన్ ప్రదీప్, బిందు, తుంపర సేద్యం పథక సంచాలకుడు వరప్రసాదరావు, సచివాలయ సిబ్బంది చిలకమ్మ, దుర్గ, మల్లిక, మధు, చంద్రరావు, సత్య, కూటమినేతలు మన్యం ప్రసన్నకుమార్, శ్రీను, దొరబాబు, సురేష్ పాల్గొన్నారు.

దోమాడ బాధితులకు మూడు సెంట్ల చొప్పున స్థలాల అప్పగింత

కాకినాడ సిటీ, మే 24 (ఆంధ్రజ్యోతి): పెదపూడి మండలం దోమాడలో ఇళ్లు కూల్చి వేసిన ఘటనలో 9 బాధిత కుటుంబాలకు వేట్లపాలెం రోడ్డులో మూడేసి సెంట్ల చొప్పున స్థలాలను శనివారం పెదపూడి తహసీల్దారు నేతృత్వంలో కేటాయించారు. బాధిత కుటుంబాలతో పాటు ఆంధ్ర మాలమహానాడు రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు సిద్ధాంతుల కొండబాబు, జైభీమ్‌రావు భారత పార్టీ రాజకీయ వ్యవహారాల చైర్మన్ ఏనుగుపల్లి కృష్ణ, సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకుడు గుబ్బల ఆదినారాయణమూర్తి, ఆంధ్ర మాలమహానాడు యువజన సంఘం నాయకుడు ఉల్లం రవి పాల్గొన్నారు.



అవగాహన సభలో మాట్లాడుతున్న ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ రేణుక

నాటుసారా రహిత జిల్లాగా

తీర్చిదిద్దడమే నవోదయం-2.0 లక్ష్యం

● ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ రేణుక

సర్పవరంజంక్షన్, మే24(ఆంధ్రజ్యోతి): కల్తీ మద్యం, నాటుసారా వినియోగంతో ప్రజలు పలురకాల రోగాల బారిన పడుతున్నారని, నాటు సారా రహిత జిల్లాగా కాకినాడను తీర్చిదిద్దడమే 'నవోదయం-2.0' ఉద్దేశ్యమని ప్రొహిబిషన్, ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ వి.రేణుక తెలిపారు. శనివారం ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో కాకినాడ రూరల్ మండలం సూర్యారావుపేట, సర్పవరంల్లో తాగుడికి వ్యతిరేకంగా అవగాహన గ్రామసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాలతో మార్చి 7న నవోదయం-2 ప్రారంభించి ఈ నెల 23వ తేదీలోపు నాటుసారా స్థావరాలపై దాడులు నిర్వహించి 390 మందిపై 659 కేసులు నమోదు చేశామన్నారు. రెండో దశలో 763 మందిపై బైండోవర్ కేసులు పెట్టామన్నారు. నాటుసారా తయారీకి పాల్పడిన వారికి లక్ష రూపాయల వరకు జరిమానా విధిస్తామన్నారు. నాటుసారా తయారు చేస్తే 14405 టోల్‌ఫ్రీ నెంబరుకు కాల్ చేయాలన్నారు. మద్యం వ్యాపారాలు నిర్దేశించిన సమయాల్లోనే జరగాలని, మద్యాన్ని ఎమ్మార్పీకే విక్రయించాలన్నారు. సర్పవరంలోని టైకీ పరిశ్రమలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఎంపీడీవో పసుపులేటి సతీష్, నార్త్ జోన్ సీఐ రామ్మోహన్, ఎస్ఐ వరహాలు, కుమార్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీసీసీ అధ్యక్షుడు సత్యానందరావు

విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణను ఆపాలి

కాకినాడసిటీ, మే 24(ఆంధ్రజ్యోతి): విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణను తక్షణం ఆపాలని, ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం కూటమి ప్రభుత్వమే ఈ పరిశ్రమ నిర్వహణ చేపట్టాలని డీసీసీ అధ్యక్షుడు మాదేపల్లి సత్యానందరావు డిమాండ్ చేశారు. శనివారం జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ దిశగా రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేస్తోందని, దీనిపై ఉద్యమ కార్యాచరణ రూపొందించి పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపడతామన్నారు. కార్మికుల తొలగింపును నిరసిస్తూ విశాఖలో పీసీసీ అధ్యక్షురాలు షర్మిల చేపట్టిన నిరాహార దీక్షను భగ్నం చేసి హైదరాబాద్ తరలించిన ప్రభుత్వ తీరు సరికాదన్నారు. సమావేశంలో జిల్లా కాంగ్రెస్ అధికార ప్రతినిధి మరోతి శివగణేష్, పీసీసీ ప్రధాన కార్యదర్శి నక్క సత్యనారాయణ, పీసీసీ సభ్యుడు శ్రీ వత్సవాయి సత్యనారాయణరాజు పాల్గొన్నారు.

అడవిపుంత రోడ్డులో ఆక్రమణలు తొలగించాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న రైతుకూలీ సంఘం, కార్మిక సంఘాల సమాఖ్య ప్రతినిధులు

గొల్లప్రోలు, మే 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని చేబ్రోలు గ్రామ పరిధి అడవిపుంత రోడ్డును ప్రైవేటు ఫ్యాక్టరీ యజమాన్యం ఆక్రమించుకుని కలప వేయడంతోపాటు రోడ్డుపైనే ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసిందని ఏపీ రైతు కూలీ సంఘం, అఖిలభారత కార్మిక సంఘాల సమాఖ్య ప్రతినిధులు తెలిపారు. ఆక్రమణల తొలగింపునకు తక్షణం చర్యలు తీసుకోవాలని కోరుతూ శనివారం వారు గొల్లప్రోలు తహసీల్దారు సత్యనారాయణకు వినతిపత్రం అందజేశారు. ఫ్యాక్టరీ నుంచి వచ్చే వ్యర్థాలను రోడ్డుపై వదిలివేస్తున్నారని, దీనివల్ల ఆ మార్గంలో వెళ్లే రైతులు తీవ్ర ఇబ్బందిపడుతున్నారని తెలిపారు. ఆక్రమణలను తొలగించి ఫ్యాక్టరీ యజమాన్యంపై చర్యలు తీసుకోవాలని, లేకుంటే ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏపీఆర్‌సీఎస్, ఏఐఎఫ్‌టీయూ ఉమ్మడి తూర్పుగోదావరిజిల్లా అధ్యక్షులు వల్లూరి రాజబాబు, కుంచే అంజిబాబు, నాయకులు కుడితి సతీష్, డి.నారాయణమూర్తి, గుడాల చార్లెస్, బళ్ల సోమరాజు పాల్గొన్నారు.

ఇంజనీరింగ్ వర్కర్ల ప్రదర్శన, ధర్నా



పిఠాపురంలో మునిసిపల్ ఇంజనీరింగ్ వర్కర్లు నిర్వహించిన ప్రదర్శన

పిఠాపురం, మే24 (ఆంధ్రజ్యోతి): సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఆంధ్రప్రదేశ్ మునిసిపల్ ఇంజనీరింగ్ వర్కర్స్ యూనియన్ ఉమ్మడి తూర్పు గోదావరిజిల్లా శాఖ ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం కాకినాడ జిల్లా పిఠాపురంలో ప్రదర్శన, ధర్నా నిర్వహించారు. వివిధ పురపాలక సంఘాల్లోని కార్మికులు తరలివచ్చారు. ఇక్కడ ఆందోళన అనంతరం జనసేన కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. అత్యవసర విభాగాలు అయిన నీటి సరఫరా, వీధి దీపాల కార్మికులకురూ.24,500-2 9,200 చెల్లించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, 15 సంవత్సరాలు పైబడిన కార్మికులను రెగ్యులరైజ్ చేయాలని, సంక్షేమ పథకాలు, హెచ్‌ఆర్‌పాలసీ అమలు చేయాలని నినాదాలు చేశారు. ఉద్యోగ విరమణ వయసును 62 సంవత్సరాలకు పెంచాలని, ప్రభుత్వ ఉ ద్యోగుల మాదిరిగా గ్రాట్యుటీ, నెలకు రూ.10వేల పెన్షన్ చెల్లించాలని డిమాండ్ చేశారు. ఆందోళనలో యూనియన్ ఉమ్మ డి జిల్లా ప్రతినిధులు పాల్గొన్నారు.

ఘనంగా రాణి అహల్యా బాయి హోల్కర్ జయంతి

కార్పొరేషన్(కాకినాడ), మే24 (ఆంధ్రజ్యోతి): రాణి అహల్యాబాయి హోల్కర్ 300వ జయంతిని నగరంలోని సూర్యకళామందిరంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు బిక్కిన విశ్వేశ్వరరావు ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన మాజీ ఎమ్మెల్సీ, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ మాట్లాడుతూ అహల్యా బాయి హోల్కర్ మరాఠాలు పరిపాలించిన మాళ్వా సామ్రాజ్యపు హోల్కరు వంశరాణి అన్నారు. ఇండోర్, మహేశ్వర్ ప్రాంతాల్లో అనేక హిందూ ఆలయాలను నిర్మించి ప్రసిద్ధి కెక్కారన్నారు. నాయకులు పైడా కృష్ణమోహన్, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వేటుకూరి సూర్యనారాయణరాజు, మీడియా ప్రతినిధి నాని, జ్యోతుల రాజేష్, తుమ్మల పద్మజ, ముత్తా నవీన్ పాల్గొన్నారు.



జ్యోతిప్రజ్వలన చేస్తున్న బీజేపీ నాయకులు

యోగాసనాల పోటీలు



యోగాసనాలు వేస్తున్న విద్యార్థులు

జేఎన్టీయూకే, మే 24 (ఆంధ్రజ్యోతి): వర్సిటీలోని స్టూడెంట్ ఎమినిటీస్ భవనంలో గల యోగా శిక్షణ కేంద్రంలో జేఎన్టీయూకే ఎన్ఎస్ఎస్ సెల్ ఆధ్వర్యంలో చిన్నారులకు, విద్యార్థులకు, పెద్దలకు శనివారం యోగాసనాల పోటీలు నిర్వహించారు. ఉప కులపతి సీఎస్ఆర్కే ప్రసాద్ సూచనల మేరకు యోగాంధ్ర-2025లో భాగంగా జూన్ 21వ తేదీ వరకు చిన్నారులకు, విద్యార్థులకు, బోధన, బోధనేతర సిబ్బందికి యోగా శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్టు వర్సిటీ ఎన్ఎస్ ఎస్ సెల్ సమన్వయకర్త డాక్టర్ జి.శ్యామ్‌కుమార్ తెలిపారు. ఈ నెల 31న యోగా ప్రదర్శన, జూన్ 7న యోగా థీమ్ పాటల పోటీ లు, 14న రంగోళీ, చిత్రలేఖనం పోటీలు, 21న అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుక నిర్వహిస్తామన్నారు. యోగా శిక్షకురాలు సీహెచ్ సుధాదేవి, న్యాయనిర్ణేతలు, సిబ్బంది పాల్గొన్నారు.

యోగాపై అవగాహన

పిఠాపురం రూరల్, మే 24 (ఆంధ్రజ్యోతి): పిఠాపురం మండలం విరవాడలో శనివారం యోగాపై అవగాహన సదస్సు నిర్వహించారు. యోగా గురువు వనం సత్యప్రియ, వైద్యాధికారి డాక్టర్ నీరజ, కోచ్‌లు వెంకట సత్యరామకృష్ణ, స్నిగ్ధ యోగావల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు.

సంస్థాన సత్రం భూముల వేలాన్ని పారదర్శకంగా నిర్వహించాలి

● మాజీ ఎమ్మెల్యే వర్మ



పిఠాపురంలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే వర్మ

పిఠాపురం, మే 24 (ఆంధ్రజ్యోతి): పేదలు, విద్యార్థుల చదువులు, వారికి భోజన సదుపాయాలు కల్పించేందుకు పిఠాపురం మహారాజా దానం చేసిన భూముల వేలాన్ని పారదర్శకంగా నిర్వహించాలని పిఠాపురం మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్‌వర్మ డిమాండ్ చేశారు. పిఠాపురం మహారాజా ఇందుకోసం తొండంగి మండలంలో 511 ఎకరాల భూమిని దానం చేశారని తెలిపారు. పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో శనివారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2013వరకు ఈ భూములను వేలం లేకుండా సాగుకు కట్టబెట్టడంతో ఏటా కేవలం రూ.6-7లక్షలు మాత్రమే ఆదాయం వచ్చేదన్నారు. 2014లో తాను ఎమ్మె ల్యేగా ఎన్నికైన తర్వాత ఈ విషయం తన దృష్టికి రావడంతో పోలీసు బందోబస్తుతో వేలం నిర్వహించామని తెలిపారు. తద్వారా ఏటా భూముల కౌలు వేలం ద్వారా ఆదాయం ఒక్కసారిగా రూ.53లక్షలు వచ్చిందని చెప్పా రు. ఈ ఆదాయంతో విద్యార్థులకు ఉచితంగా భోజనం, పాలిటెక్నిక్ తదితర ప్రవేశ పరీక్షలకు ఉచితంగా కోచింగ్ ఇచ్చామన్నారు. వైసీపీ పాలనలో పరిస్థితి మరలా మొదటికి వచ్చిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇప్పుడు ఆ భూములు వేలం అని చెప్పి ఆకస్మికంగా వాయిదా వేయడంతో పలు అనుమానాలు వస్తున్నాయన్నారు. దేవదాయ శాఖ అధికారులు నిజాయితీతో, నిబద్ధతతో వేలం నిర్వహిస్తే కనీసం రూ.80-90లక్షల ఆదాయం వస్తుందని తెలిపారు.

'మహానాడును విజయవంతం చేద్దాం'

సర్పవరం జంక్షన్, మే 24 (ఆంధ్రజ్యోతి): కడపలో ఈనెల 27 నుంచి 29వ తేదీ వరకు జరిగే మహానాడును విజయవంతం చేద్దామని ఆపార్టీ కాకినాడ రూరల్ నియోజకవర్గ కో-కో-ఆర్డినేటర్, రాష్ట్ర కార్యదర్శి కటకంశెట్టి ప్రభాకర్ (బాబీ) పిలుపునిచ్చారు. శనివారం ఆయన కరణంగారి సెంటర్లో పార్టీ కార్యకర్తలతో సమావేశమయ్యారు. కాకినాడ రూరల్ నుంచి పలువాహనాల్లో కడప వెళ్లేందుకు సోమవారం మధ్యాహ్నం 12 గంటలకు విస్తృత ఏర్పాట్లు చేశామన్నా రు. మహానాడుకి వచ్చేవారు 8886767175 నెంబర్‌కి కాల్ చేయాలని కోరారు. రూట్ మ్యాప్, ఆహారం, తాగునీరు, వసతి తదితర ఏర్పాట్లపై చర్చించారు. రాష్ట్రగౌడ, ఎస్సీ కార్పొరేషన్ల డైరెక్టర్లు మట్టాప్రకాశ్‌గౌడ్, కొల్లాబత్తుల అప్పారావు, మాజీ ఎంపీపీ గుల్లిపల్లి శ్రీనివాసరావు, టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు రాందేవు సీతయ్యదొర, చోడి శెట్టి కృష్ణ, కృష్ణకాంత్, రాజేష్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ప్రభాకర్



ప్రత్యేక అంకరణలో శృంగార వల్లభ స్వామి

తొలి తిరుపతికి పోటెత్తిన భక్తులు

పెద్దాపురం, మే 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తొలి తిరుపతికి శనివారం భక్తులు పోటెత్తారు. శృంగార వల్లభస్వామికి అర్చకులు పెద్దింటి పురుషోత్తమాచార్యులు, పెద్దింటి నారాయణాచార్యులు విశేష పూజలు, అభిషేకాలు చేశారు. సుమారు 15వేల మందికి పైగా భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. రూ.2,71,180 ఆదాయం లభించినట్టు ఈవో వడ్డి శ్రీనివాసరావు తెలిపారు.

రేపు పిఠాపురంలో పీజీఆర్ఎస్

పిఠాపురం, మే 24 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పాత బస్టాండువద్ద గల పాడా కార్యాలయంలో సోమవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక నిర్వహిస్తున్నట్టు ప్రాజెక్టు డైరెక్టర్ ఎ.చైత్రవర్షిణి తెలిపారు. అన్నిశాఖల డివిజన్, మండల స్థాయి అధికారులు హాజరుకావాలని ఆమె ఆదేశించారు. ప్రజలు తమ సమస్యలుపై అర్జీలు ఇవ్వవచ్చన్నారు.

'మహానాడుకు తరలివెళ్లాలి'

● టీడీపీ పెరిక సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్ బద్రి



కాకినాడసిటీ, మే 24 (ఆంధ్రజ్యోతి): పార్టీ కోసం పనిచేసే వారికి, నిరుపేద కుటుంబాలకు టీడీపీ అండగా ఉంటుందని టీడీపీ పెరిక సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్ బద్రి పేర్కొన్నారు. ఈనెల 26, 27, 28 తేదీల్లో కడపలో జరిగే మహానాడులో పాల్గొనేందుకు, బీసీ కులాలు, టీడీపీ కుటుంబసభ్యులు తరలివెళ్లాలని ఆయన పిలుపునిచ్చారు.


'భూమి కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి'

కాకినాడ సిటీ, మే 24 (ఆంధ్రజ్యోతి): కాకినాడ రూరల్ మండలం రమణయ్యపేట పంచాయతీ గైగోలుపాడులో సర్వే నెం.261/1,6,7, 276/1,2,3ల్లో తమకుగల 3.05 ఎకరాల భూమిని కబ్జాకు పాల్పడిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని బాధితులు విన్నవించుకున్నారు. వాసంశెట్టి వెంకట్రావు, పెంకే అప్పయమ్మ, పెంకే సత్యవతి, బత్తిన శ్రీను శనివారం కలెక్టరేట్ వద్ద ధర్నా చేసిన సంతకాలతో కూడిన వినతిపత్రాన్ని అధికారులకు సమర్పించారు.

తాగునీటి పైపులైన్లకు మరమ్మతులు

సామర్లకోట, మే 24 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పెన్షన్ లైన్ సమీపంలో తాగునీటి పైపులైన్లకు మున్సిపల్ ఇంజనీరింగ్ అధికారులు శనివారం మరమ్మతులు చేశారు. తాత్కాలిక నీటి సరఫరాలో భాగంగా ఆదివారం ట్రయల్ రన్ వేస్తామని, సోమవారం నుంచి పూర్తిస్థాయిలో సరఫరి చేస్తామని చెప్పారు.

రేపు మదుగులమ్మ జాతర



సామర్లకోట, మే 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని హుస్సేన్‌పురం గ్రామ దేవత మదుగులమ్మ అమ్మవారి జాతరను సోమవారం పెద్ద ఎత్తున నిర్వహించనున్నట్టు ఉత్సవ కమిటీ ప్రతినిధి చల్లా బుజ్జి తెలిపారు. ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప ఉత్సవాన్ని ప్రారంభిస్తారన్నారు.

రేపు డీఎస్సీ ఉచిత మోడల్ గ్రాండ్ టెస్ట్



గ్రాండ్ టెస్ట్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న దృశ్యం

కార్పొరేషన్ (కాకినాడ), మే 24 (ఆంధ్రజ్యోతి): నగరంలోని విద్యుత్‌నగర్ శ్యామ్ ఇనిస్టిట్యూట్‌లో ఆదివారం డీఎస్సీ ఉచిత మోడల్ గ్రాండ్ టెస్ట్ నిర్వహించనున్నారు. దీనికి సంబంధించిన పోస్టర్‌ను యంగ్‌మైండ్స్ స్వచ్ఛంద సేవాసంస్థ అధ్యక్షుడు వాకాడ వెంకటరమణ, పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు చింతాడ ప్రదీప్‌కుమార్, శ్యామ్ ఇనిస్టిట్యూట్ డైరెక్టర్ శ్యామ్ శనివారం ఆవిష్కరించారు. ఆసక్తి గల ఎస్జీటీ అభ్యర్థులు 9346287425 నెంబరుకు వాట్సాప్ మెసేజ్ చేయాలన్నారు. మధ్యాహ్నం రెండు గంట లకు పరీక్ష ప్రారంభమవుతుందని, గంట ముందు రిపోర్ట్ చేయాలన్నారు. కార్యక్రమంలో పీఆర్టీయూ రాష్ట్ర కౌన్సిలర్ ఏజీవీ సుబ్బారావు, కాకినాడ రూరల్ శాఖ అధ్యక్షుడు డీవీవీ బాపిరాజు, శ్యామ్ ఇనిస్టిట్యూట్ సీఈవో శ్రీనివాస్ పాల్గొన్నారు.

అంగ్‌వాడీ కార్యకర్త పద్మ తొలగింపుపై కోర్టుకు వెళతాం

రౌతులపూడి, మే 24 (ఆంధ్రజ్యోతి): రామకృష్ణాపురం అంగన్‌వాడీ కార్యకర్త పద్మ తొలగింపు అన్యాయమని, ఆమెకు న్యాయం చేసేందుకు కోర్టుకు వెళతామని ప్రాజెక్టు లీడర్లు జి.బుల్లమ్మ, రత్నకుమారి, బి.సత్యవేణి అన్నారు. కొత్తగా నియమించుకుంటున్న పి.భవానీని సెంటర్‌కు రాకుండా అడ్డుకుని నిరసన వ్యక్తం చేశారు. రోస్టర్ పద్ధతిలో పద్మ 13 ఏళ్లుగా పని చేస్తోందన్నారు.

రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • దేవీపట్నం • రాజవొమ్మంగి • అడ్డతీగల • గంగవరం • వై రామవరం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక

ఆంధ్రాలో తవ్వకం..తెలంగాణలో అమ్మకం

• సరిహద్దులో యథేచ్ఛగా మట్టి, గ్రావెల్ దందా
• చోద్యం చూస్తున్న రెవెన్యూ అధికారులు


గుండువారిగూడెంలో చెరువులో గ్రావెల్ తవ్వకాలు నిర్వహిస్తున్న దృశ్యం

ఎటపాక, మే 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర సరిహద్దు ప్రాంతం ఎటపాక మండలంలో మట్టి, గ్రావెల్ దందా జోరుగా సాగుతోంది. రెవెన్యూ అధికారులు పట్టించుకోక పోవడంతో మట్టి, గ్రావెల్‌ను యథేచ్ఛగా తరలిస్తున్నారు. ఎటపాక మండలం గుండువారిగూడెం, చెన్నంపేట, మేడివాయి, ఎటపాక, గుండాల కాలనీ తదితర ప్రాంతాల నుంచి ఎటువంటి అనుమతులు లేకుండా మట్టి, గ్రావెల్ తరలిస్తున్నారు. ఆ ప్రాంతాల్లో రాత్రి, పగలు అనే తేడా లేకుండా తవ్వకాలు చేపట్టి మట్టి, గ్రావెల్ రవాణా చేస్తున్నారు. ఈ ప్రాంతాల్లో తవ్వకాలు చేస్తూ పొరుగున ఉన్న తెలంగాణలోని భద్రాచలం పట్టణంలో అమ్మకాలు నిర్వహిస్తున్నారు. తాజాగా శనివారం గుండువారిగూడెంలో మట్టి తవ్వకాలు నిర్వహించారు. మట్టి, గ్రావెల్‌ను తెలంగాణలో విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఒక్కో ట్రాక్టర్ రూ.2వేల నుంచి రూ.2500 వరకు విక్రయిస్తున్నారు. దూరాన్ని బట్టి సొమ్ములు వసూళ్లు చేస్తున్నారు. ప్రతీ రోజూ సరిహద్దులో ఏదో ఒకచోట యథేచ్ఛగా మట్టి, గ్రావెల్ దందా నడుస్తున్నా రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపణలు వస్తున్నాయి. చెరువులు, పంట పొలాలు, వివాదాస్పద భూముల్లో తవ్వకాలు నిర్వహిస్తున్నారు.

మహానాడుకు భారీగా తరలిరండి

ఎమ్మెల్యే శిరీషదేవి


పాముగండిలో నాయకులతో ఎమ్మెల్యే శిరీషదేవి

దేవీపట్నం, మే 24(ఆంధ్రజ్యోతి): కడప జరగబోయే టీడీపీ మహానాడు కార్యక్రమానికి మండల నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలిరావాలని టీడీపీ రంపచోడవరం ఎమ్మెల్యే పార్టీ మిరియాల శిరీషదేవి కోరారు. శనివారం పాముగండిలో జరిగిన వివాహ కార్యక్రమానికి ఆమె హాజరయ్యారు. ఈ సందర్భంగా కార్యకర్తలతో ఆమె మాట్లాడుతూ టీడీపీ వ్యవస్థాపకుడు నందమూరి తారకరామారావు జయంతిని పురస్కరించుకుని కడపలో ఈనెల 27, 28, 29, తేదీల్లో నిర్వహించ నున్న టీడీపీ మహానాడుకు ప్రతి గ్రామం నుంచి నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు తరలిరావాలన్నారు. ఆమె వెంట టీడీపీ మండల కన్వీనర్ మరిశెట్ల వెంకటేశ్వరరావు, కోసు అచ్చిబాబు, పాముగండి సర్పంచ్ శివారెడ్డి, మాజీ సర్పంచ్ నాయకులు మాగాపు బాబూరావు, ముచ్చు వీర వెంకట సత్యనారాయణ, రేలంగి రాంబాబు, అంజిరెడ్డి, కీర్తి గంగరాజు, వాసు కొండారెడ్డి మోహన్ తదితరులు ఉన్నారు.

పోలీసుల ముమ్మర తనిఖీలు

మోతుగూడెం, మే 24(ఆంధ్రజ్యోతి): మన్యంలో సరిహద్దు ఉన్న ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో ఇటీవల వరుస ఎన్‌కౌంటర్లు, ఒడిశాలో మావోయిస్టుల కదలికలు నేపథ్యంలో రెండు రోజులుగా డొంకరాయి, వై.రామవరం, మోతుగూడెం పోలీసులు అప్రమత్తమయ్యారు. వాహనాలు తనిఖీలు చేస్తున్నారు. ఛత్తీస్‌గఢ్‌లో తాజా కాల్పుల ఘటనలతో పాటు ఈనెలాఖరున ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పాడేరు పర్యటన నేపథ్యంలో తనిఖీలు మరింత ముమ్మరం చేశారు. రెండు రోజుల నుంచి డొంకరాయి సరిహద్దు, మోతుగూడెం సరిహద్దు మార్గాల్లో బారికేడ్లు ఏర్పాటుచేసి వాహనాలను తనిఖీలు చేస్తున్నారు. భద్రాచలం - వైజాగ్ - రాజమహేంద్రవరం సరిహద్దు ఒడిశా ప్రాంతాల్లో తనిఖీలు పెంచారు. జిల్లాను పోలీసులు జల్లెడ పడుతున్నారు.


డొంకరాయిలో కారును తనిఖీ చేస్తున్న పోలీసులు

యోగాతో ఆరోగ్యకర జీవనం

రంపచోడవరం, మే 24(ఆంధ్రజ్యోతి): యోగాతో ఆరోగ్యకర జీవనాన్ని సాగించ వచ్చునని ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం అన్నారు. శనివారం ఆయన తన కార్యాలయ చాంబర్‌లో వివిధ పాఠశాలల ఫిజికల్ డైరెక్టర్లతో యోగా కార్యక్రమాల నిర్వహణపై చర్చించారు. ఈసందర్భంగా పీవో మాట్లాడుతూ ప్రపంచంలో యోగాకు మంచి గుర్తింపు ఉందని, పంచాయతీల పరిధిలో జూన్ 21 వరకు యోగా కార్యక్రమాలు నిర్వహించి ప్రజలకు యోగాపై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. డివిజన్‌లో యోగాకు మంచి గుర్తింపు వచ్చేలా అధికారులు, సిబ్బంది సమన్వయంతో కార్యక్రమాలు నిర్వహించా లన్నారు. కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్లు కె.తిరుపతిరావు, కె.మంగాయమ్మ, కె.భవాని, కృష్ణారావు, చిన్న పోతురాజు, సుజిత కుమారి, శశికాంత్‌రెడ్డి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో సింహాచలం

కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలు


రిలే దీక్షల్లో పాల్గొన్న ఆదివాసీ జేఏసీ నాయకులు

రంపచోడవరం, మే 24(ఆంధ్రజ్యోతి): షెడ్యూల్డ్ ప్రాంతాల్లో ఉద్యోగాల నియామకాల కోసం చట్టం చేయాలని కోరుతూ ఆదివాసీ జేఏసీ ఆధ్వర్యంలో ఐటీడీఏ కార్యాలయం ఎదుట చేస్తున్న రిలే నిరాహార దీక్షలు శనివారానికి పదో రోజుకు చేరాయి. రిలే దీక్షల్లో పాల్గొన్న వారికి ఆదివాసీ జేఏసీ కోర్ కమిటీ సభ్యుడు పూలదండలు వేశారు. ఈ సందర్భంగా పీడీ, పీఈటీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు వి.కృష్ణారావు మాట్లాడుతూ 2025 జనరల్ డీఎస్సీ నుంచి షెడ్యూల్డ్ ప్రాంత ఆదివాసీ టీచర్ పోస్టులు మినహాయించి, యుద్ధ ప్రాతిపదికన నూరు శాతం స్థానిక ఆదివాసీ పట్టభద్రులతోనే భర్తీ చేసేందుకు ఆదివాసీ ప్రత్యేక డీఎస్సీ నోటిఫి కేషన్ విడుదల చేయాలన్నారు. తక్షణమే ట్రైబల్ అడ్వయిజరీ కౌన్సిల్ ఏర్పా టుకు తీర్మానం చేసి షెడ్యూల్డ్ ప్రాంత ఉద్యోగాల నియామకాల చట్టం ప్రకటించాలన్నారు. వివిధ శాఖల్లో ఖాళీ గా ఉన్న ఎస్టీ బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేయాలన్నారు. ఐటీడీఏల ద్వారా నిరుద్యోగ యువతకు ట్రైకార్ రుణాలు మంజూరు చేయాలన్నారు. కార్యక్రమంలో ఎం.చిన్న స్వామి, కె.మంగాయమ్మ, చవలం శుభకృష్ణదొర, ఆదివాసీ రాష్ట్ర వైస్ చైర్మన్ తెల్లం శేఖర్, కారం రామన్నదొర, పండా పవన్‌కుమార్‌దొర, మడకం వరప్రసాద్‌దొర, కొమరం కిషోర్ బాబు, యలగాడ నాగేశ్వర రావు, కలుముల పోతు రాజు, ఎం.సుగుణ దొర, కె.కుమారి, కుంజం అగ్గిదొర, కత్తుల ఆదిరెడ్డి, కె.రామ కృష్ణదొర, పిశికాంత్‌రెడ్డి, వై.శీతమ్మ, కె.గౌరమ్మ, కె.భవాని, ఎస్.ఇంద్ర రెడ్డి, పి.పొందుదొర, కుంజం రాంబాబు దొర, కుర్సం ఫకీర్‌దొర, గంటిమల్ల సత్యనారాయణ పాల్గొన్నారు.

పండ్రాజుపల్లిలో పోలవరం గ్రామసభ

కూనవరం, మే 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని పండ్రాజుపల్లిలో శనివారం గ్రామసభ నిర్వహించారు. ఈసందర్భంగా ఇంటి వాల్యుయేషన్ నోటీసులు అందజేశారు. భూమికి భూమి సంబంధించిన పెండింగ్‌లో ఉన్న నోటీసులు అందజేశారు. పండ్రాజుపల్లి ఇంకా 85కుటుంబాలను నిర్వాసితులకు గుర్తించి వారిని కూడా నంపు జాబితాలో చేర్చాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ పాయం రంగమ్మ, పోలవరం అధికారులు పాల్గొన్నారు.


గ్రామసభలో పాల్గొన్న గిరిజనులు

జగ్గంపేట

• జగ్గంపేట • తుని • ప్రత్తిపాడు


ప్రత్తిపాడు మార్కెట్ సెంటర్‌లో కేకును పంచుతున్న టీడీపీ నాయకులు


పెద్దిపాలెంలో రెడ్డి అమర్నాథ్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి పంపిణీ చేస్తున్నదృశ్యం


రాచపల్లిలో బుద్దరాజుగోపిరాజు ఆధ్వర్యంలో కేక్ కట్ చేస్తున్న కార్యకర్తలు

ఘనంగా ఎమ్మెల్యే సత్యప్రభ జన్మదిన వేడుకలు

● గ్రామాల్లో భారీ ఎత్తున కేక్ కటింగ్‌లు.. సామాజిక కార్యక్రమాలు

ప్రత్తిపాడు, మే 24(ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ జన్మదిన వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. ప్రత్తిపాడు మార్కెట్ సెంటర్‌లో టీడీపీ నాయకులు యాళ్ల జగదీష్, వెలుగుల నాని, చలంకూరి భాను, మూరావరప్రసాద్, పోలిశెట్టిశ్రీను, బదినే దొరబాబు కేక్ కట్ చేసి, అభిమానులకు స్వీట్లు పంచారు. స్థానికంగా ఉన్న ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆసుపత్రిలో సూపరింటెండెంట్ డాక్టర్ సౌమ్యతో కలిసి కేక్ కట్ చేసి సేవా కార్యక్రమాలు చేశారు. పెద్దిపాలెంలో టీడీపీ సీనియర్ నేత రెడ్డి అమర్నాథ్‌చౌదరి, రాచపల్లిలో బుద్ధరాజు గోపిరాజు, వాకపల్లిలో సర్పంచ్ రొంగల నాగేశ్వరరావు, చినశంకర్లపూడిలో మాజీ ఎంపీటీసీ మిరియాల శ్రీను, ఉత్తరకంచిలో సర్పంచ్ మంతెన శ్రీను, సుబ్బారెడ్డి సాగర్ చైర్మన్ ఇళ్ళ అప్పారావు, ఒమ్మంగి, శరభవరం, ధర్మవరం గ్రామాల్లో టీడీపీ కార్యకర్తలు, నాయకుల ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి అభిమానులు, కార్యకర్తలకు పంపిణీ చేశారు.

దుప్పట్లు, చీరల పంపిణీ

ధర్మవరం పశువుల ఆసుపత్రి సెంటర్ వద్ద కూటమి నాయకులు వృద్ధులు, కార్మికులకు దుప్పట్లు, చీరలు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ జన్మదినం సందర్భంగా పుణ్యమంతుల బ్రదర్స్ ఆధ్వర్యంలో సర్పంచ్ బెంతుకుర్తి సుశీల అబ్బాయి, మాజీ సర్పంచ్ పుణ్యమంతుల కామరాజు నిర్వహించిన కార్యక్రమంలో నాయకులు వై.గోవిందనాయుడు, దాసం శేషారావు, ఊటా వీరబాబు, ఎస్.నూకరాజు, జి.వీరన్న, బొండాడ నారాయణుడు, కొప్పనబోయిన ఏసు, పుణ్యమంతుల రాజా, తదితరులు పాల్గొన్నారు.


ఏలేశ్వరం పట్టణంలో కేక్ కట్ చేస్తున్న చైర్‌పర్సన్ సత్యవతి, టీడీపీ శ్రేణులు

ఏలేశ్వరం: ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ జన్మదినం సందర్భంగా స్థానిక కౌన్సిలర్ అలండ చలమయ్య నివాసం వద్ద నగర పంచాయతీ చైర్‌పర్సన్ అలమండ సత్యవతి, మహిళలు, టీడీపీ నాయకులతో కలిసి కేక్ కట్ చేశారు. అలాగే టీడీపీ పట్టణాధ్యక్షుడు మూది నారాయణస్వామి, కౌన్సిలర్ కేక్ కట్ చేశారు.మండలంలోని పెద్దనాపల్లిలో ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి నేతృత్వంలో కేక్ కట్ చేశారు. కార్యక్రమాల్లో బూర్లు సత్తిబాబు, సుంకర సుబ్బారావు, సఖిరెడ్డి విజయబాబు, వైబోగుల సుబ్బారావు, బెల్లాని శ్రీను, సుంకర సత్యనారాయణ, నూకతాటి ఈశ్వరుడు పాల్గొన్నారు.

శంఖవరం: ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభరాజా జన్మదినం సందర్భంగా శంఖవరంలో టీడీపీ సీనియర్ నాయకుడు పర్వత సురేష్, కత్తిపూడిలో టీఎన్‌టీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెన్నా ఈశ్వరుడు(శివ), వజ్రకూటంలో కీర్తి సురేష్, నెల్లిపూడిలో టీడీపీ మండలాధ్యక్షుడు బద్ది రామారావు, జి.కొత్తపల్లిలో సర్పం గోవిందు, మండపంలో పోలం చిన్నా ఆధ్వర్యంలో వేడుకలను నిర్వహించారు.

రౌతులపూడి: టీఎస్‌ఎస్‌ఎఫ్ నియోకవర్గ అధ్యక్షుడు గవిరెడ్డి గురునాథ్ అన్నవరం మెట్ల మార్గంలో 50 మంది యాచకులకు దుప్పట్లను అందజేశారు. రౌతులపూడిలో మాజీ ఎంపీపీ ఇటంశెట్టి సూర్యభాస్కరరావు, కొప్పుల వెలమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పైల సాంబశిరావు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే సత్యప్రభ జన్మదిన వేడుకలు నిర్వహించారు.


శంఖవరంలో..


రౌతులపూడిలో..

ఎమ్మెల్యే కార్యాలయం వద్ద జన్మదిన వేడుకలు



కేక్ కట్ చేస్తున్న దృశ్యం

ప్రత్తిపాడు, మే 24(ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడు తోట వీధిలోని ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ కార్యాలయం వద్ద శనివారం రాత్రి ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ పార్లమెంటరీ ఉపాధ్యక్షుడు కొమ్ముల కన్నబాబు, యాళ్ళ జగదీష్, వై.విశ్వేశ్వరరావు పాల్గొని కేక్ కట్ చేసి అభిమానులకు పంపిణీ చేశారు.

రాచపల్లిలో బసవేశ్వరుడికి ప్రత్యేక అభిషేకాలు

ప్రత్తిపాడు, మే 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాచపల్లిలో అపీత కుచాంబ సమేత అరుణాచలేశ్వర స్వామి ఆలయంలో బసవేశ్వర విగ్రహానికి శనివారం రాత్రి ప్రత్యేక అభిషేకాలు, అలంకరణలు నిర్వహించారు. ప్రదోషకాల త్రయోదశి ప్రత్యేక 21 ద్రవ్యాలతో కూడిన అభిషేకాలు బసవేశ్వర స్వామికి అష్టోత్తర మహారతులు నిర్వహించారు. రమణ సేవా శ్రమ నిర్వాహకులు రామానంద స్వామి ఆధ్వర్యంలో వేద పండితులు, భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

క్రైస్తవుల సహాయ మాత దేవాలయం ప్రారంభం

కిర్లంపూడి, మే 24 (ఆంధ్రజ్యోతి): కిర్లంపూడి అంబేద్కర్‌నగర్‌లో నూతనంగా నిర్మించిన క్రైస్తవుల సహాయ మాత దేవాలయాన్ని శనివారం ప్రారంభించారు. జిల్లా టీడీపీ అధ్యక్షుడు జ్యోతుల నవీన్ హాజరై ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు చదరం చంటిబాబు, గ్రామ సర్పంచ్ శ్రీలత రాంబాబు, టీడీపీ నాయకులు కాళ్ళ వెంకటేష్, సరిసే శివ, యల్లపు చిన్న, క్రైస్తవ సోదరులు, తదితరులు పాల్గొన్నారు.

తిరుచ్చిసేవ స్థానంలో పల్లకీసేవ

అన్నవరం, మే24(ఆంధ్రజ్యోతి): రత్నగిరి వాసుడైన సత్యదేవుడి సన్నిధిలో శనివారం కురిసిన వర్షం కారణంగా స్వామివారికి ఆలయ ప్రాంగణం వెలుపల నిర్వహించాల్సిన తిరుచ్చిసేవ స్థానంలో అంతర్గతంగా పల్లకీసేవ నిర్వహించారు. స్వామి,అమ్మవార్లను పల్లకీలో ఉంచి ముమ్మారు ఆలయప్రాకార అంతర్భాగంలో భక్తుల గోవిందనామస్మరణలు, బాజాభజంత్రీల నడుమ చేపట్టారు. చైర్మన్ రోహిత్ సేవలో పాల్గొన్నారు.

ఆకట్టుకున్న చిన్నారుల నృత్యప్రదర్శన

అన్నవరం దేవస్థానంలో పర్వదినాలలో నిర్వహించే సాం స్కృతిక కార్యక్రమాల్లో భాగంగా శనివారం చిన్నారుల నృత్యప్రదర్శన భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. విశాఖపట్నం బాలభవన్ ఆధ్వర్యంలో శ్రీమతి లలితబృందంచే 15 మంది చిన్నారుల బృందం వివిధ భక్తిపాటలతో నృత్యప్రదర్శన గావించగా వీరందరినీ దేవస్థానం ఈవో అభినందించి ప్రసంసాపత్రాలను అందజేశారు.

వ్యర్థాల శాంపిల్ల సేకరణ

● ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాల నిర్వహణ

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్


ముగ్గు బ్లీచింగ్ చల్లుతున్న సిబ్బంది

తొండంగి, మే 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రావికంపాడు తూము వద్ద పేరుకుపోయిన వ్యర్థాలపై శనివారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన 'రహదారిలో వ్యర్థాలు' అనే శీర్షికకు అధికారులు స్పందించారు. జిల్లా కాలుష్య నియంత్రణ మండలి ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అనలిస్ట్ ప్రతాప్, ఫీల్డ్‌మేన్ రమేష్ రావికంపాడు వచ్చి వ్యర్థాలు ఉన్న ప్రాంతాన్ని పరిశీలించారు. అక్కడ ఉన్న వ్యర్థాల శాంపిళ్లు సేకరించారు. ఆ ప్రాంతంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల్లో వచ్చిన వాహనాల వివరాలు నమోదయ్యాయో లేదో పరిశీలించారు. దీనికి సంబంధించిన వ్యర్థాలు ఎక్కడ నుంచి వస్తున్నాయన్న వివరాలు సేకరిస్తున్నారు. ఎంపీడీవో రాజేశ్వరరావు ఆదేశాల మేరకు పంచాయతీ కార్యదర్శి రామారావు ఆ ప్రాంతంలో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టారు. పారిశుధ్య సిబ్బందితో ముగ్గు, బ్లీచింగ్ చల్లించారు. వ్యర్థాలు తెచ్చే వాహనాలపై ప్రత్యేక నిఘా పెడతామన్నారు.

ఏయూ ఫలితాల్లో 'శ్రీ ప్రకాష్' విద్యార్థుల ప్రతిభ

తుని రూరల్, మే 24 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర విశ్వ విద్యాలయం 2022-25 డిగ్రీ బ్యాచ్‌కి విడుదల చేసిన ఫలితాల్లో శ్రీ ప్రకాష్ విద్యాసంస్థల అనుబంధ సంస్థ అయిన స్పేసెస్ డిగ్రీ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. మాకిరెడ్డి జయంతి బీఎస్సీ విభాగం నందు యూనివర్శిటీ 2వ ర్యాంక్, జిల్లా మొదటి ర్యాంక్ బీబీఏ విభాగం నందు నక్కా షారా జిల్లా 2వ ర్యాంక్, సయ్యద్ గుల్ఫిషాన్, మద్దూరి కాశీ అన్నపూర్ణ జిల్లా 3వ ర్యాంక్ సాధించారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.రామకృష్ణారెడ్డి తెలిపారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను విద్యాసంస్థల అధినేత సీహెచ్‌వీకే నరసింహారావు, సంయుక్త కార్యదర్శి విజయ్ ప్రకాష్, విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు తదితరులు అభినందించారు.


జయంతి


కాశీ అన్నపూర్ణ


సయ్యద్ గుల్ఫిషాన్


నక్కా సారా

కాంగ్రెస్ పార్టీ ఆందోళన


ఆందోళనలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు

ప్రత్తిపాడు, మే 24(ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడు అల్లూరి సీతారామరాజు సెంటర్ అధ్వానంపై శనివారం కాంగ్రెస్ పార్టీ ఆందోళన నిర్వహించారు. పీసీసీ సభ్యుడు ధర్నాల కోట శ్రీను ఆధ్వర్యంలో పార్టీ కార్యకర్తలు అల్లూరి సెంటర్ వద్ద ఆందోళన నిర్వహించారు. చిన్నపాటి వర్షానికి చెరువులా మారుతున్న అల్లూరి సీతారామరాజు సెంటర్‌ను యాళ్ల తరబడి పాలకులు, అధికారులు నిర్లక్ష్యంగా వదిలేస్తున్నారని నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో దాసరి సత్తిబాబు, గుర్రాల మల్లయ్య, సూరిబాబు, మాదే రమణ, తదితరులు పాల్గొన్నారు.

పంట కాలువల అభివృద్ధి పూర్తి చేయాలి

బీకేఎస్ జిల్లా అధ్యక్షుడు రాసంశెట్టి రాజా


మాట్లాడుతున్న బీకేఎస్ జిల్లా అధ్యక్షుడు రాజా

ప్రత్తిపాడు, మే 24(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఖరీఫ్ సీజన్ దగ్గర పడుతున్నా పంట కాలువల అభివృద్ధి పూర్తి చేయకపోవడం వల్ల రైతులు ఇబ్బందులు పడుతున్నారని భారతీయ కిసాన్ సంఘం జిల్లా అధ్యక్షుడు రాసంశెట్టి రాజా అన్నారు. ప్రత్తిపాడులో శనివారం సాయంత్రం నిర్వహించిన రైతుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో పంట కాలువల పరిస్థితి చాలా అధ్వానంగా ఉందన్నారు. ఖరీఫ్ సీజన్ చాలా దగ్గరపడుతుందని ఈ లోగా గుర్రపు డెక్క తొలగించి పూడిక తీతలు పూర్తి చేయాలని కోరారు. రాష్ట్ర బీకేఎస్ సంఘటనా కార్యదర్శి కొండబాబు మాట్లాడుతూ అన్నవరంలో జూన్ 2, 3 తేదీల్లో బీకేఎస్ ఆధ్వర్యంలో నిర్వహించే 5 జిల్లాల శిక్షణా తరగతులను విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో బీకేఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు నీలగిరి చిట్టిబాబు, కార్యదర్శి ఆకుల హరిబాబు, మహిళా ప్రముఖ్ దాడిశెట్టి పావని, కాకిలేటి వీర్రాజు, జువ్విన వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

'వైసీసీ అవమానించింది ... కూటమి ప్రభుత్వం గౌరవం ఇచ్చింది'

కోటనందూరు, మే 24 (ఆంధ్రజ్యోతి): రేషన డీలర్లకు వైసీపీ ప్రభు త్వం అవమానిస్తే - కూటమి ప్రభుత్వం గౌరవిం చిందని మండల రేషన్ డీలర్లు అన్నారు. రాష్ట్రప్రభుత్వం రేషను డోర్ డెలివరీ వ్యవస్థను రద్దు చేసి రేషను దుకాణాలు వద్దే పంపిణీపై హర్షం వ్యక్తంచేశారు. ఏ.మల్లవరంలో టీడీపీ మండలాధ్యక్షుడు గాడి రాజుబాబును ఆయన నివాసంలో కలిసి మండల రేషన్ డీలర్ల అధ్యక్షుడు దారకొండ జోగిరాజు ఆధ్వర్యంలో సన్మానించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మాజీమంత్రి యనమల రామకృష్ణుడు, ఎమ్మెల్యే యనమల దివ్యకు కృతజ్ఞతలు తెలిపారు.

ఉపాధి కూలీల బకాయి వేతనాలను విడుదల చేయాలి

తునిరూరల్, మే 24 (ఆంధ్రజ్యోతి): ఉపాధి కూలీల బకాయి విడుదల చేయలని కార్మిక సంఘం నాయకుడు నక్కెళ్ల శ్రీనివాస్ కోరారు. హంసవరంలో ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న కార్మికుల సమస్యలు అడిగి తెలుసుకున్న ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ కార్మికుల బకాయి డబ్బులు తక్షణం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ కూలీలకు మౌలికసదుపాయాలు కల్పించాలని, ఎండల తీవ్రత తట్టుకోవడానికి టెంట్లు వేయించాలని, మంచినీటి సౌకర్యం కల్పించాలని కోరారు.

ఫోన్‌లో 'యనమల' పరామర్శ


తునిలో సాగర్ కుటుంబాన్ని పరామర్శిస్తున్న టీడీపీ నాయకులు

తుని రూరల్, మే 24 (ఆంధ్రజ్యోతి): సీనియర్ పాత్రికేయుడు వద్దా సాగర్ మాతృవియోగం చెందడంతో ఆయన కుటుంబాన్ని ఫోన్‌లో మాజీమంత్రి యనమల రామకృష్ణుడు శనివారం పరామర్శించారు. యనమల ఆదేశాలతో టీడీపీ నాయకులు, చింతమనీడి అబ్బాయి, తామరన రామకృష్ణ, పోలిశెట్టి మార్కండేయులు సాగర్‌ను పరామర్శించి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

ఏలేశ్వరంలో అన్నదానం


అన్నదానంలో పాల్గొన్న భక్తులు

ఏలేశ్వరం, మే 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక షిర్డీ నగర్‌లో భారీ అన్నదానం నిర్వహించారు. హనుమాన్ జయంతి వేడుకల్లో భాగంగా శనివారం శ్రీఅభయాంజనేయస్వామి ఉత్సవ కమిటీ నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామిని దర్శించుకొని అన్నప్రసాదం స్వీకరించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ బదిరెడ్డి గోవింద్, సామంతుల సూర్యకుమార్, సుంకర రాంబాబు, పైల విజయ్‌కుమార్, కావలి శ్రీనివాస్, అలమండ దుర్గా వెంకట ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

యోగాంధ్రను విజయవంతం చేయండి


ఎంపీడీవో కార్యాలయంలో కార్యదర్శులతో సమావేశం నిర్వహిస్తున్న ఎంపీడీవో కుమార్‌బాబు

ప్రత్తిపాడు, మే 24 (ఆంధ్రజ్యోతి): యోగాంధ్ర కార్యక్రమాన్ని నెల రోజులు పాటు గ్రామాల్లో విజయవంతంగా నిర్వహించేందుకు గ్రామ కార్యదర్శులు చర్యలు చేపట్టాలని ఎంపీడీవో ఎంవీఆర్ కుమార్ బాబు కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన మండల కార్యదర్శుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ యోగాపై గ్రామీణ ప్రజలకు పూర్తి అవగాహన కల్పించేవిధంగా చర్యలు చేపట్టాలన్నారు. అలాగే చిన్నారుల ఆధార్, జనన ధ్రువపత్రాల మంజూరుకు చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో డిప్యూటీ ఎంపీడీవో కాశీ విశ్వనాధ్, కార్యదర్శులు బి.వీరబాబు, ఎం.లక్ష్మీనారాయణ, జ్యోతుల పద్మరాజు, బి.కామరాజు, గంగాభవాని, తదితరులు పాల్గొన్నారు.